PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 18.01.2013, శుక్రవారం సంపుటి : 32 సంచిక : 33 పేజీలు : 12, వెల : ₹ 4

24గం॥ చిన్నపిల్లల స్పెషలిస్టులచే వైద్యం చేయు ఏకైక చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్
నెలలు తక్కువ బిడ్డా ?
సంరక్షణ కొరకు...
పూర్తి పిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (NICU)

Dr. T. Ravikumar's
రిచ్ హాస్పిటల్
రవి చిన్నపిల్లల హాస్పిటల్

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## ధీరోదాత్తుడిని ఎదుర్కోవడానికే...

# ధారాదత్తం



### » ఒక వ్యక్తి ... రెండు రాష్ట్రాలు » జగనే టార్గెట్ ... విభజనే టాబ్లెట్

*గడియారంలో గంటల ముల్లు శరవేగంగా తిరుగుతోంది... క్యాలెండర్‌లో తేదీలు చకచక మారుతున్నాయి. జనవరి 28వ తేదీ సమీపిస్తున్న కొద్దీ టెన్షన్ పెరుగుతోంది. ఆ రోజున అణుబాంబు కంటే శక్తివంతమైన బాంబును కేంద్ర ప్రభుత్వం ఈ రాష్ట్ర ప్రజల నెత్తిన వేయబోతుంది. ఆ బాంబు ఎంత వినాశనం సృష్టించబోతుందో, ఎన్ని బ్రతుకులను నాశనం చేయబోతుందో, ఎంత బూడిద మిగల్చబోతుందో ఊహించుకుంటేనే ఒళ్లు జలదరిస్తోంది.*

ఒక ఓటు రెండు రాష్ట్రాలు... ఇదే బీజేపీ సిద్ధాంతం. ఒక వ్యక్తి... రెండు రాష్ట్రాలు... ఇదీ రేపు కాంగ్రెస్ అనుసరించి అమలు చేయబోతున్న సిద్ధాంతం. ప్రజల కోసం, పరిపాలనా సౌలభ్యం కోసం చరిత్రలో ఒక రాష్ట్రాన్ని రెండుగా విడదీసిన సంఘటనలున్నాయి. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల విభజన జరిగివుంది. కాని ఒక వ్యక్తిని రాజకీయంగా ఎదుర్కొనడం చేతగాక అతని ప్రభావాన్ని తగ్గించేందుకు ఒక రాష్ట్రాన్నే రెండుముక్కలు చేయనున్న అరుదైన సంఘటనను మనం అతిత్వరలోనే చూడబోతున్నాం. యువనాయకుడు జగన్‌ను రాజకీయంగా దెబ్బతీయడం కోసం తెలుగుజాతిని రెండుగా చీల్చడానికి యూపీఏ ప్రభుత్వం సిద్ధమైంది. ఈమేరకు సంకేతాలు కూడా వెలువడుతున్నాయి. గత నెలలోనే తెలంగాణ అంశం మీద కేంద్ర హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండే అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి అందరి అభిప్రాయాలు వినడం (మిగతా 5వ పేజీలో)

## ఎన్నాళ్లకెన్నాళ్ళకు...

# తీరిన కోరిక


*సేవే శ్వాసగా, పోరాటమే వృత్తిగా, రాజకీయరంగమే వేదికగా మలచుకున్న అతికొద్దిమంది నాయకులలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఒకరు. రాజకీయాలలో గెలుపునైనా, ఓటమినైనా సమానంగా స్వీకరించే గుండెధైర్యమున్న నాయకుడు. ఏ అంశం మీదైనా తనదైన ధోరణిలో వాదించి నెగ్గించుకోగల అపర రాజకీయ మేధావి. గెలిచినా, ఓడినా ప్రజల మధ్య వుండే అసలైన లీడర్.*

సోమిరెడ్డికి చాలాకాలం నుండి ఒక గోల్ కొట్టాలనే కోరిక వుంది. ఇంతకాలంగా జిల్లా రాజకీయాలకే పరిమితమైవున్న తాను రాష్ట్ర రాజకీయాల్లోకి వెళ్లాలనే కోరిక బలంగా వుండేది. తెలుగుదేశంపార్టీలో అతిముఖ్యమైన నాయకులతో కూడిన పొలిట్‌బ్యూరోలో స్థానం కోసం ఆయన ఇంతకాలం ఎదురుచూస్తూ వచ్చారు. అందుకోసమే (మిగతా 5వ పేజీలో)



'దేశం' పొలిట్‌బ్యూరో సభ్యుడిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

## ఒబామా ప్రమాణస్వీకారోత్సవానికి



### శ్వేతసౌధానికి అనుత్తమ్

నెల్లూరీయుడికి అరుదైన అవకాశం

(వార్త 2వ పేజీలో)



బాలలతో "బాలార్క" పండుగ కానుక

# రావమ్మా మహాలక్ష్మీ...!



సుప్రసిద్ధ సంగీత విద్వాంసురాలు శ్రీమతి బాలార్క ప్రతి పండగకూ నెల్లూరీ యులకు అందించదలచిన సంగీత కార్యక్ర మాలలో భాగంగా "రావమ్మా మహాలక్ష్మీ" అంటూ జనవరి 13వతేదీ భోగి పండుగ సందర్భంగా నిర్వహించిన గానామృత కార్యక్రమం సింహపురి సంగీత ప్రియుల హృదయాలను దోచుకుంది. తన వద్ద సంగీతం నేర్చుకుంటున్న శిష్యులందర్నీ ఒక వేదికపైకి చేర్చి ముఖ్యమైన అన్ని పండుగల రోజున ఆమె నిర్వహించ తలపెట్టిన కార్యక్రమంలో రెండవదిగా ఈ సంగీత సంరంభం జరిగింది.

విజయదశమి సందర్భంగా మొదటి కార్యక్రమాన్ని నిర్వహించిన బాలార్క భోగి సంక్రాంతులను పురస్కరించుకుని ఈ రెండవ కార్యక్రమాన్ని ఆనంద భరితంగా అందించారు. సుమారు 50మంది పిల్లలు పెద్దలతో కలసి "బాలార్క" ఆలపించిన అన్నమయ్య, త్యాగరాజు, రామానుజా చార్యుల కీర్తనలు ఆహూతులను అల రించాయి.

ఎ.బి.సి స్కూళ్ళలో మమ్మీడాడీ కల్చర్‌కు అలవాటు పడుతున్న రేపటితరం పౌరులకు తెలుగు పండుగలు తెలుగు పండుగల ప్రత్యేకత, సంప్రదాయం సంస్కృతి గురించి తెలియజేసి మన భాష, మన సిద్ధాంతాల పట్ల వారిని చైతన్యవంతులను చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యంగా శ్రీమతి బాలార్క పేర్కొన్నారు.

కళారాధకుల అండగా టౌన్‌హాలు నిండగా కన్నుల పండుగగా ఈ వేడుక జరిగింది. నగరంలోని పలురంగాలకు చెందిన ప్రముఖులు, సంగీతసాహిత్య సాంస్కృతిక అభిమానులు ఈ కార్యక్ర మంలో పాల్గొని బాలార్కను ఆమె శిష్యు లను ఆశీర్వదించారు.



# 'వైట్‌హౌస్'కి అనుత్తమ్



అమెరికా అధ్యక్షుడిగా రెండవసారి ఎన్నికై సంచ లనాత్మక విజయాన్ని సొంతం చేసుకున్న బరాక్ ఒబామా ప్రమాణస్వీకార మహోత్సవాలు జనవరి 19 నుండి 23వరకు 5రోజుల పాటు అమెరికాలోని వాషింగ్‌టన్‌లో వున్న అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో అత్యంత ఆడంబరంగా జరుగ బోతున్నాయి. అంబరాన్ని తాకే సంబరంగా జరిగే ఈ ఆనంద వేడుకలలో పాల్గొనే అరుదైన అవకాశం మన నెల్లూరుజిల్లా అల్లూరుకు చెందిన మూకలపాటి అనిల్, పార్వతిరెడ్డిల కుమారుడు అనుత్తమ్‌కు దక్కింది.

హైదరాబాదులోని చైతన్య విద్యాలయంలో తన బాల్య విద్యాభ్యాసాన్ని అభ్యసించిన అనుత్తమ్ 9 నుండి సీనియర్ ఇంటర్ వరకూ "ఇండస్ అంతర్జాతీయ స్కూల్"లో చదివాడు. అనుత్తమ్‌కి చిన్నప్పటి నుండే "గోల్ఫ్" అంటే మక్కువ. తన 13యేళ్ల ప్రాయం లోనే అమెరికాకి వెళ్లి గోల్ఫ్‌లో తర్ఫీదు పొందాడు. అనుత్తమ్‌కి చిన్నప్పటి నుండే తాననుకున్న లక్ష్యాలను సాధించడంలో పట్టుదల ఎక్కువంటారు వాళ్లమ్మ, నాన్న. తాననుకున్నది సాధించడం కోసం కష్టపడి పనిచేసే నైజం కూడా తనకుందని వాళ్లంటారు.

గోల్ఫ్‌పై వున్న మక్కువతో అనేక టోర్నమెంట్లలో పాల్గొని కప్పులు సాధించిన సందర్భాలు చాలానే వున్నాయంటారు వీళ్ళు.

ఆరోగ్యం కోసం మెరుగైన పరిసరాల రూపకల్పనలో భాగంగా ప్రభుత్వరంగ సంస్థ "గ్రీన్‌క్రాఫ్"తో కలసి పనిచేసి అనేక సలహాలు సూచనలు ఇచ్చాడు అనుత్తమ్. మెరుగైన నగరాల రూపకల్పన, భవిష్యత్ హైదరాబాద్ అభివృద్ధి వంటి అంశాలతో వివిధ రంగాలలో నిష్ణాతులైన మేధావులతో సలహాలు, సంప్రదింపులు, సమావేశాలు జరిపి వారి సూచనలతో "స్కల్ప్ట్ యువర్ సిటీ" అని ప్రభుత్వం రూపొందించిన పుస్తకంలోని మొదటి 20టీమ్‌లలో అనుత్తమ్ టీమ్ వుండడం గమనార్హం. కొన్ని వందల గ్రూప్‌లు పాల్గొన్న ఈ సెమినార్‌లో అనుత్తమ్ గ్రూప్‌కి ఉత్తమ టీమ్‌గా గుర్తింపురావడం అతనిలోని నాయకత్వపు లక్షణాలకు సూచిక.

హైదరాబాదు సమీపంలోని మొకిల అనే గ్రామంలో మంచి నీటి సౌకర్యాన్ని అందించడానికి తన సహచర విద్యార్థులతో కలిసి కృషి చేశాడు. కళలన్నా, కళాకారులన్నా, పెయింటింగ్స్ అన్నా అనుత్తమ్‌కి మక్కువ ఎక్కువ. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ "ఫేస్‌బుక్"లో నెలరోజుల పాటు ఇంటర్న్‌షిప్ చేయడమే కాకుండా, ఇండస్ ఇంటర్‌నేషనల్ స్కూల్ విద్యార్థిగా క్రీడా విభాగానికి కెప్టెన్‌గా హిమాలయ పర్వతాలను ట్రెక్కింగ్ ద్వారా అధిరోహించిన ఘనత కూడా అనుత్తమ్‌కి వుంది.

అమెరికాలోని బోస్టన్ నగరంలో బెంట్లీ యూనివర్సిటీలో వ్యాపార వ్యవహారాలకు సంబంధించిన అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుని అభ్యసిస్తున్న అనుత్తమ్‌కి వాషింగటన్ శ్వేతసౌధం నుండి ఆహ్వానం అందింది. అమెరికా అధ్యక్ష ఉపాధ్యక్షుల ప్రమాణస్వీకార మహోత్సవం సందర్భంగా 5రోజుల పాటు జరిగే వివిధ ఈవెం ట్లలో పాలుపంచు కోవలసిందిగా అనుత్తమ్‌కి వైట్‌హౌస్ లేఖ వ్రాస్తూ ఆ వివరాలను అతని తల్లిదండ్రులకు మరో లేఖ ద్వారా తెలిపారు. తమ బిడ్డకు దక్కిన ఈ అరుదైన అవకాశానికి అనుత్తమ్ తల్లి దండ్రులు ఓవైపు మురిసిపోతుంటే అనుత్తమ్ మిత్రులు, అతనికి ఇన్నాళ్లు చదువుచెప్పిన గురువులు మరోవైపు ఆనంద సంబరాలను జరుపుకుంటున్నారు.

నెల్లూరుజిల్లాకు చెందిన అనుత్తమ్‌కి ఈ గొప్ప అవకాశం రావడం ప్రతి నెల్లూరీయుడు గర్వించాల్సిన విషయం. అనుత్తమ్‌కి, పుత్రోత్సాహంతో పొంగిపోతున్న అతని అమ్మానాన్నలు అనిల్, పార్వతిలకి 'లాయర్' శుభాకాంక్షలు.



## బెనర్జీకి అభినందనలు

నెల్లూరు కళారంగంలో నటుడుగా, వ్యాఖ్యాతగా తన సేవలు అందిస్తూ అందరి అభిమానాలు చూరగొన్న దువ్వూరు బెనర్జీ బిఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కేవలం ఉద్యోగ బాధ్యతలనే కాక కార్మిక నాయకుడిగా వారి సేవలో సైతం తరిస్తున్నారు. ఇటీవల జరిగిన జిల్లా తంతితపాల ఉద్యోగస్తుల క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ పాలకవర్గ ఎన్నికలలో డైరెక్టర్‌గా పోటీచేసి అత్యధిక మెజార్టీతో గెలవడమే కాక పాలకవర్గానికి కోశాధికారిగా సైతం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కళాంజలి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కళాంజలి అనంత్ ఆయనను అభినందించారు.

# సంగమేశ్వరశాస్త్రి సేవలు స్ఫూర్తిదాయకం

వెంకయ్యనాయుడు



సంగమేశ్వరశాస్త్రి కాంస్యవిగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న యం.వెంకయ్యనాయుడు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, పి.సీతారామిరెడ్డి, మహేషానందగిరి స్వామి, కైలాసానందగిరి స్వామి

నెల్లూరు కొండాయపాళెంరోడ్డులోని జనహిత వాత్సల్య నిరాధార బాలబాలికల వసతి గృహంలో ఈనెల 16న వేదాంతం సంగమేశ్వరశాస్త్రి కాంస్య విగ్రహాన్ని బి.జె.పి జాతీయ నాయకులు, ఎం.పి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలు, నిరుపేదల కోసం దివంగత సంగమేశ్వరశాస్త్రి వసతి గృహం స్థాపించి అందించిన సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రతిఫలాపేక్ష లేకుండా చేసే మానవసేవలో ఎంతో ఆనందం వుందని, సామాజిక సేవలో లభించే సంతృప్తి, సంతోషం మరి ఎందులోనూ లభించదని పేర్కొన్నారు. రాజ్యసభసభ్యుడిగా తన నిధుల నుండి వేరే రాష్ట్రాలకు 10లక్షల రూపాయల వరకూ మంజూరుచేసే అవకాశం వుందని, అందుకోసమే వృత్తివిద్యాశిక్షణా తరగతుల కోసం భవన నిర్మాణానికి తన నిధుల నుండి 10లక్షలు మంజూరు చేశానని తెలిపారు. భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ అందరూ ఆనందంగా వుండాలని, ఆనందానికి మించిన ఆరోగ్యం లేదని, మనకున్న దాంట్లో కొంత ఇతరులకు దానం చేసినప్పుడు వారికి కలిగే ఆనందాన్ని తిలకిస్తే మనకి కూడా ఆనందం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొన్నలూరు సీతారామిరెడ్డి, సామంతు గోపాలరెడ్డి, వాసిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మహేషానందగిరి స్వామి, కైలాసానందగిరి స్వామిలతో పాటు 'వాత్సల్య' సభ్యులు, విద్యార్థులు, పలువురు పురప్రముఖులతో పాటు "జనహిత" సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా నెల్‌క్యాస్ట్ వ్యవస్థాపకుడి జయంతి



రోగులకు పండ్లు పంపిణీచేస్తున్న నెల్‌క్యాస్ట్ సిబ్బంది

గూడూరు నెల్‌క్యాస్ట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు దివంగత పొన్నపోలు రాధాకృష్ణారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం నాడు గూడూరులోని ఏరియా ఆసుపత్రిలో రోగులకు నెల్‌క్యాస్ట్ స్టాఫ్ వెల్‌ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ నెల్‌క్యాస్ట్ సంస్థ ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఎంతో మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నదన్నారు. మరియు దివంగత పొన్నపోలు రాధాకృష్ణారెడ్డి తండ్రిగారైన పొన్నపోలు పెంచలరెడ్డి ట్రస్టు ద్వారా ఉచిత వైద్యసేవలు కార్మికులకు మరియు పరిసరప్రాంతాల ప్రజలకు ఉపయోగపడేలా వైద్యసేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి డాక్టర్ ప్రసాద్‌రావు, ఎస్.ఎస్.రెడ్డి, బి.వెంకటరావు, డి.మునిచంద్రయ్య, పి.కోటిరెడ్డి, టి.మురళీకృష్ణ, టి.గజపతి, సి.హెచ్.శ్రీనివాసరావు, కె.సి.బ్రహ్మానందరెడ్డి, నెల్‌క్యాస్ట్ పి.ఆర్.ఓ ఎ.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 17వ తేదీన నెల్లూరులోని తన ఛాంబర్‌లో గ్రామరెవెన్యూ అధికారుల సంఘం రూపొందించిన 2013 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్

PDF Compressor Free Version





- చక్కెరమిల్లుకు కొరవడుతున్న సహకారం
- ప్రైవేటు ఫ్యాక్టరీల పోటీతో దెబ్బతింటున్న కర్మాగారం

# నడుపుతారా? మూస్తారా??

***నెల్లూరుజిల్లాలోనే కోవూరు అంటే డెల్టా ప్రాంతం. వరిదా రెడ్లకు ప్రసిద్ధి గాంచిన ఊరు. పారిశ్రామికంగా 40మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం, వ్యవసాయ పరంగా సహకార చక్కెర కర్మాగారం ఈ ప్రాంతంలోనే ఏర్పాటు చేశారు. కాబట్టే మొదటినుండి ఇది అభివృద్ధి చెందిన ప్రాంతంగా పరిగణించ బడుతూ వచ్చింది. ముఖ్యంగా కోవూరు సహకార చక్కెర కర్మాగారం వల్ల ఈ ప్రాంతంలో చెరుకుసాగు పెరిగింది. రైతులు బాగా లబ్ధిపొందారు.***

అయితే కొన్నేళ్లుగా ఈ ఫ్యాక్టరీ నిర్వహణలో ఒడిదుడుకులు మొదల య్యాయి. చంద్రబాబు హయాంలో అయితే ఈ పరిశ్రమకు గడ్డురోజు లొచ్చాయి. కుక్కను చంపాలంటే దానికి పిచ్చికుక్క అని ముద్ర వేయాలి. అలాగే ఒక ఫ్యాక్టరీని మూసేయాలంటే దానిని నష్టాల్లోకి నెట్టాలి. కోవూరు చక్కెర ఫ్యాక్టరీ విషయంలో చంద్రబాబు సర్కార్ అలాగే చేసింది. ఈ ఫ్యాక్టరీ నిర్వహణను అధ్వా న్నంగా చేసిపెట్టి, నష్టాల సాకు చూపించి మూతేసి, మొత్తం స్థలాన్ని అమ్మకానికి పెట్టారు. అయితే 2004లో తెలుగుదేశం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి ఆ ఫ్యాక్టరీని తిరిగి తెరిపించి రైతులకు అందజేయడం జరిగింది. ఆ తర్వాత స్వల్ప సమస్యలు వచ్చినా ఫ్యాక్టరీని నెట్టుకుంటూ వచ్చారు. ప్రతి ఏటా సీజన్‌లో క్రమం తప్పకుండా క్రషింగ్ నిర్వహిస్తూ వచ్చారు.

అయితే ఇటీవలకాలంలో ఫ్యాక్టరీ మనుగడ మళ్లీ ప్రశ్నార్థకంగా మారింది. ప్రైవేట్ కర్మాగారాలతో పోటీపడలేక కోవూరు చక్కెర కర్మాగారం నిర్వహణపై అనుమానాలు నెలకొంటున్నాయి. గతంలో చెరుకు రైతులకు 11కోట్లకు పైగా బకాయిలు వుండగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ నిధులను మంజూరు చేయించారు. రేపోమాపో రైతులకు బకాయిలు చెల్లిం చడం జరుగుతుందని స్వయంగా జిల్లా కలెక్టర్ రైతులకు చెప్పడం జరిగింది.

కాగా రైతులు కోవూరు ఫ్యాక్టరీ కంటే ప్రైవేట్ ఫ్యాక్టరీలకే చెరుకును తోలడానికి మొగ్గుచూపుతున్నారు. దీనికి కారణం ఫ్యాక్టరీ యాజమాన్య లోపమే. 600 మంది పనిచేయాల్సిన ఫ్యాక్టరీలో 200 మంది కార్మికులు మాత్రమే వుండగా, వారిలో నైపుణ్యంగల వారు సగం మందే నట. చెరుకు లోడ్‌తో వచ్చిన లారీలు, ట్రాక్టర్ల నుండి చెరుకును దించడంలో ఆలస్యమవుతుండడంతో వెయిటేజీ తగ్గి పోతుందనేది రైతుల ఆవేదన. అదీగాక ప్రైవేట్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు చెరుకుకు మద్దతుధర ప్రకటించడమే కాక అప్పటికప్పుడు నగదు చెల్లింపులు కూడా చేస్తున్నాయి. అలాంటప్పుడు బకాయిలు పెట్టే కోవూరు షుగర్‌ఫ్యాక్టరీకి చెరుకు ఎందుకు తోలాలనేది రైతుల వాదన.

కొంచెం కష్టమైనా నష్టమైనా రైతు లకు కూడా ఈ ఫ్యాక్టరీని నిలబెట్టు కోవాల్సిన బాధ్యత వుంది. ఈ ఫ్యాక్టరీ వుంటేనే ప్రైవేట్ ఫ్యాక్టరీలకు పోటీ వుంటుంది. లేకుంటే వాటిదే ఇష్టారాజ్యం అవుతుంది.



# కళ తప్పిన సంబరాలు

**నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డికి ఇష్టమైన వేడుకలన్నీ ఒక్కొక్కటీగా జరిగిపోతున్నాయి. కాకపోతే సందడి చప్పుడు లేకుండా! రొట్టెలపండుగతో మొదలై... కార్తీకమాసం, ముక్కోటి.. నిశ్శబ్దంగా వెళ్లిపోయాయి.**

నూతన సంవత్సరం అంటే సరి... భోగి, సంక్రాంతి, కనుమ పండుగలప్పుడు వివేకా వుంటే ఎంతో సందడిగా సంతోషంగా వుండేది. సంక్రాంతి పండగ అంటే పెద్దల పండుగ. ప్రతి ఏటా బోడిగాడితోటలో పెద్దల సమాధులకు రంగులు కొట్టించే వాడు... శ్మశానాన్ని కూడా అందంగా మార్చడమే కాదు, ఆ శ్మశానంలోనే అధికారులతో సమీక్షా సమావేశాలు, విలేకరుల సమావేశాలు పెట్టి, స్పెషల్‌గా అక్కడే భోజనాలు కూడా పెట్టించేవాడు. సంక్రాంతి పండక్కి నెల్లూరుచెరువులో పడవ పందేలు పెట్టించడమేకాక, బిళ్లంగోడు, చిక్‌చిక్‌పుల్ల, కోతికొమ్మచ్చి వంటి సాంప్రదాయ ఆటలపోటీలు పెట్టించేవాడు. కనుమ పండుగ రోజున మైపాడుగేటు వద్ద జరిగే శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి తెప్పోత్సవంలో అన్నీ తానై వ్యవహరించేవాడు. కనుమ పండుగ పక్కరోజు పెన్నానదిలో జరిగే గొబ్బెమ్మల పండుగ గురించి అయితే

(మిగతా 5వ పేజీలో)



# సెకండ్ ఇన్నింగ్స్‌కు రెడీ

***ఆత్మకూరు మాజీశాసనసభ్యుడు బొల్లినేని కృష్ణయ్య నాయుడు రాజకీయ రీఎంట్రీకి 'రెఢీ' అవుతున్నాడనే సంకేతాలు వినవస్తున్నాయి. ఇటీవల ఆత్మకూరులో జరిగిన మంత్రుల పర్యటనలో క్షణం తీరిక లేకుండా అంతర్జాతీయ స్థాయిలో కాంట్రాక్టు పనులు నిర్వహించే ఆయన పాల్గొనడమే ఇందుకు నిదర్శనం.***

దీంతో మళ్ళీ ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనే అవకాశం లేకపోలేదని పరిశీలకుల అంచనా. 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి పరాజయం పాలైన తర్వాత ప్రత్యక్షరాజకీయాలకు దూరంగా వున్నారు. అంతకుముందు 1999లో ఆత్మకూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. ఆ సమయంలో రాష్ట్రమంతా తెలుగుదేశం గాలి వీస్తున్నా ఘనవిజయం సాధించడం విశేషం. 2004లో జరిగిన ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన ప్రత్యక్ష రాజకీయాలకు దూరమై వ్యాపార కార్యక్రమాల్లో లీనమయ్యారు. అయితే ఇటీవల ఆత్మకూరులో జరిగిన ముగ్గురు మంత్రుల పర్యటనలో బొల్లినేని పాల్గొని ఆనంను పొగడ్తలతో ముంచెత్తారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటివరకు ఎవ్వరూ చేయనన్ని

(మిగతా 5వ పేజీలో)



***జిల్లాలోని పది నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల జాబితాను సవరించి విడుదల చేశారు. జిల్లా ఓటర్లలో మహిళలే అగ్రస్థానంలో నిలిచారు. జిల్లా మొత్తం 19,87,274 ఓట్లుండగా వారిలో మహిళలు 10,06,936 మంది కాగా, పురుషులు 9,86,338మంది.***

# మహిళే మహారాణి

## నియోజకవర్గాల వారీగా చూస్తే...

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | మొత్తం |
|---|---|---|---|
| 233 కావలి | 98,995 | 1,03,638 | 2,02,633 |
| 234 ఆత్మకూరు | 94,504 | 95,350 | 1,89,854 |
| 235 కోవూరు | 1,07,802 | 1,15,475 | 2,23,277 |
| 236 నెల్లూరు నగరం | 96,038 | 95,989 | 1,92,027 |
| 237 నెల్లూరు గ్రామీణం | 1,00,431 | 1,02,458 | 2,02,889 |
| 238 సర్వేపల్లి | 90,880 | 93,445 | 1,84,325 |
| 239 గూడూరు | 94,490 | 99,284 | 1,93,774 |
| 240 సూళ్లూరుపేట | 98,422 | 1,01,092 | 1,99,514 |
| 241 వెంకటగిరి | 96,611 | 98,054 | 1,94,665 |
| 242 ఉదయగిరి | 1,02,165 | 1,02,151 | 2,04,316 |
| **మొత్తం** | **9,80,338** | **10,06,936** | **19,87,274** |

18ఏళ్లు నిండిన వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోగా కొత్తగా 67వేల ఓట్లను చేర్చి 2170ఓట్లను తొలగించి కొత్త ఓటర్ల జాబితాను విడుదల చేసారు. అన్ని ఆర్డీవో, తహాశీల్దార్‌ల కార్యాలయాల్లో, బూత్‌లెవల్ ఆఫీసర్ల వద్ద ఈ ఓటర్ల జాబితాలను అందుబాటులో వుంచారు. కాగా జిల్లా జనాభా 29,66,082గా నిర్ణయించారు.

# సహకార ఓట్లకు.. నోట్ల గాలం

*దాదాపు పాతికేళ్లక్రితం వరకు ఎన్నికలంటే... ఎక్కడ చూసినా జెండాలు, బ్యానర్లు, గోడలమీద ఎన్నికల గుర్తులు, వాల్‌పోస్టర్లు, కరపత్రాలు, మైకుల్లో నినాదాలు, సెంటర్‌లలో ఆయా నాయకుల భారీ కటౌట్‌లు... కాని కాలక్రమేణా ఆ వాతావరణం మారుతూ వచ్చింది. ఓటుకు* ***500****రూపాయల నోటు... వారంరోజుల పాటు క్వార్టర్ సీసాలు. ఇదీ ఇప్పటి ఎన్నికల తీరు.*

జిల్లాలో సహకార ఎన్నికలు జరుగ నున్నాయి. కాని ఆ సందడి మాత్రం కనిపించడం లేదు. ప్రజలందరూ పాల్గొనే ఎన్నికలు కావు. అయినా కూడా గతంలో సహకార ఎన్నికలంటే కొంత హంగామా కనిపించేది. ఇప్పుడది లేదు. రైతులను ఓటర్లుగా చేర్పే బాధ్యత నాయకులదే! ఓటుకు 330రూపాయలు కట్టాలి. దానిని రైతు కట్టడు, నాయకుడే కట్టాలి. ఎవరికి నమ్మకమున్న రైతులకు ఆ నాయకులే డబ్బులు కట్టి ఓటర్ల జాబితాల్లో పేర్లు చేర్పారు.

కాని సీన్ ఇక్కడితో అయిపోయిందా? తన తరపున 330రూపాయలు కట్టిన నాయకుడికే ఓటరు ఓటేస్తాడా? ఇది ప్రశ్నార్థకమే! ఇక్కడా మళ్లీ నోట్లు కీలక పాత్ర పోషించబోతున్నాయి. ప్రజలం దరూ పాల్గొనే ఎన్నికలలోనే ఓటు విలువ 500 నుండి 1000రూపాయల దాకా పలుకుతోంది. మరిప్పుడు ఇవి ప్రత్యేక ఎన్నికలు. వందమందిలో ఏ నలుగురైదు గురికో ఓట్లుంటాయి. ఓటరే కింగ్ అన్నమాట. ఇక ఓటు విలువ ఏ స్థాయిలో పెరుగుతుందో ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. ఒక్కో సొసైటీలో వెయ్యి నుండి మూడు, నాలుగు, ఐదువేల దాకా ఓట్లుంటాయి. ఒక్కో సొసైటీలో ఒక్క అభ్యర్థి ఖర్చు పాతికలక్షలు దాటిపోతున్నట్లు తెలుస్తుంది. అంటే సరాసరిన ఓటు వెయ్యి పలుకుతున్నట్లే!

# తేలని అభ్యర్థులు


సహకార ఎన్నికలు ముంచుకొస్తున్న ప్పటికీ బ్యాంక్ ఛైర్మన్ అభ్యర్థులు ఎవర నేది ఇంతవరకు తేలలేదు. కాంగ్రెస్, వై.యస్.ఆర్. కాంగ్రెస్‌ల తరపున ఛైర్మన్ పదవి కోసం కొందరు ఉత్సాహం చూపిస్తున్నప్పటికీ తెలుగుదేశం పార్టీలో మాత్రం ఆ ఊపు కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీ నుండి ఛైర్మన్ రేస్‌లో ఆనం విజయకుమార్‌రెడ్డితో పాటు ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముఖ్య అనుచరుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేరు విని పిస్తుంది. ఆర్థికంగా బలవంతుడు కాబట్టి రేపు ఎన్నికలలో ఖర్చుకూడా పెట్టుకో గలడు. వైకాపా నుండి చూస్తే నల్లపరెడ్డి అనుచరుడు నల్లావుల శ్రీనివాసులరెడ్డితో పాటు సూళ్లూరుపేటకు చెందిన దబ్బల రాజారెడ్డి కూడా రేస్‌లో వున్నట్లు తెలుస్తుంది.

అమ్మ ఫర్నిచర్ వారి
అమ్మ ఫర్నిచర్‌మాల్
మినీ బైపాస్‌రోడ్డు, నెల్లూరు.
ప్రపంచస్థాయి మోడల్స్
ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్

PDF Compressor Free Version



లాయర్




## కమ్యూనిస్టుల కుళ్లు రాజకీయం

యాభైఏళ్ల క్రితం హైద్రాబాద్‌లో ఛార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి గుడి లేదని సీపీఎం నాయకులంటున్నారు. ఈ 50ఏళ్లలో జమ్మూ-కాశ్మీర్‌లలో ఎన్నో దేవాలయాలను మతోన్మాదులు నేలమట్టం చేసారు. మరి ఆ గుళ్ల గురించి ఈ కమ్యూనిష్టులు ఎప్పుడూ మాట్లాడలేదు. గుజరాత్‌లో మైనార్టీల మీద జరిగిన దాడుల గురించి మాట్లాడుతారు. మరి కాశ్మీర్ నుండి ఆస్తులను వదులుకొని వచ్చి ఢిల్లీలో ప్లాట్ ఫారాలమీద బ్రతుకుతున్న పండిట్‌ల గురించి మాట్లాడరేం?

సి.రాజీవి, నెల్లూరు.

## అక్బర్‌ను వెనకేసుకొస్తున్నారు

ఓటుబ్యాంకు రాజకీయాలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీని వెనకేసుకొస్తుంది. మతోన్మాదంతో అతను ఏం మాట్లాడాడో వీళ్ల చెవికి ఎక్కినట్లు లేదు. లేదా వీళ్లు కూడా హిందువులమీద ద్వేషంతో అక్బరుద్దీన్‌ను సమర్ధిస్తున్నారా? రాజకీయ పార్టీలకు మతాల పిచ్చి వుండకూడదు. ఆ పిచ్చి వుంటే ఏ పార్టీ మనుగడ అయినా స్వల్పకాలమే!

జి.మనోహర్‌రెడ్డి, చెన్నై.

## సంక్రాంతి సందడి తగ్గింది

మారిన పరిస్థితులు, పెరిగిన ధరలు, ఆధునిక పోకడలు, తగ్గుతున్న మానవ సంబంధాలు... కారణం ఏదైతేనేం మన పండుగలలో కళ తప్పుతుంది. ఆధునిక సంస్కృతి, సంబంధాల ముసుగులో మన సంస్కృతి సంప్రదాయాలను మరుస్తున్నాం. మనిషి పక్కా స్వార్ధంతో జీవిస్తుండడంతో పల్లెసీమలు కళ తప్పుతున్నాయి. పల్లెను నమ్ముకుని బ్రతికే రైతులు తప్పితే నేటి ఆధునిక యువకులు పల్లెలకు కనీసం పండుగలకు కూడా పోవడం లేదు.

గంగిశెట్టి మాల్యాద్రి,
కందుకూరు.

## అదే జోరు కొనసాగాలి!

ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డేలో భారత జట్టు సమిష్టిగా ఆడి విజయం సాధించింది. బలహీనంగా వున్న బౌలింగ్ విభాగం ఆ మ్యాచ్‌లో అద్భుతంగా కనిపించింది. వందపైచిలుకు పరుగుల తేడాతో గెలిచిందంటే అది వారి పుణ్యమే. భారత్ ఇదే జోరు కొనసాగించాలి.

జె.ఎస్.ఎస్., నెల్లూరు.

## 'ప్రభా'తం

కొన్ని సమయాలలో అతి మంచితనం, అతి మెతకతనం పనికిరాదంటారు. మన మంచితనం అవతలివారికి చేతగానితనంగా కనిపించినప్పుడు, తాత్కాలికంగానైనా ఆ మంచితనాన్ని పక్కనపెట్టి మనమేంటో అవతల వారికి చూపించాల్సిన అవసరముంటుంది. ప్రపంచానికి శాంతిని బోధించిన ముగ్గురు మహాపురుషుల(గౌతమబుద్ధుడు, ఏసుక్రీస్తు, బాపూజీ)లో ఇద్దరు భారతదేశంలో పుట్టినవాళ్లే. కాబట్టేనేమో శాంతగుణం, దయ, జాలి గుణం మనకు వారసత్వంగా వచ్చినట్లున్నాయి. అయితే కాలాన్నిబట్టి మనం కూడా మారకతప్పదేమో! ఒక చెంప మీద కొడితే రెండో చెంప చూపించమన్న గాంధీజీ శాంతి సిద్ధాంతం డెబ్భై, ఎనభై ఏళ్ల క్రితం సరిపోయిందేమో గాని ఈరోజు ఒక చెంపమీద కొడితే తిరిగి రెండు చెంపల మీద మనం కొట్టగలిగితేనే మనుగడ... లేదంటే అవతలివాడి చేతిలో బానిసలం కావాల్సిందే!

చెప్పులో రాయి, చెవిలో జోరీగ, కంట్లో నలుసు, పక్కలో బల్లెం... మన పక్కనే పాకిస్థాన్. సుదీర్ఘ కాలం తెల్లదొరలతో పోరాడి ఎలాగోలా వాడి పీడ వదిలించుకున్నాం. కాని అదే సమయంలో దేశవిభజన పేరుతో తెల్లదొరలకంటే కసాయిదైన ఒక శత్రుదేశాన్ని పాకిస్థాన్ రూపంలో మనమంతట మనమే తయారుచేసుకున్నాం. 200ఏళ్లు తెల్లదొరలతో ఎంతగా పోరాడామో, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఈ 65ఏళ్లలో పాకిస్థాన్‌తో అంతకంటే ఎక్కువ పోరాడాం! ఒక విధంగా ఆలోచిస్తే బ్రిటీషోడి కంటే కూడా మనం ఏర్పాటుచేసిన పాకిస్థాన్ వల్లే మనకు ఎక్కువ నష్టం జరిగింది... జరగబోతుంది కూడా!



### సరిహద్దుల్లో చెలగాటం

పాకిస్థాన్‌తో శాంతి ఒప్పందాలు, స్నేహ సంబంధాలు వ్యర్థప్రయత్నమనేది తేలిపోయింది. మనం స్నేహం కోసం చేతులు చాచేకొద్దీ వారికది అలుసుగా మారుతుంది. భారత్ పట్ల అక్కడి పాలకులలో సానుకూలధోరణి వున్నా పాక్ సైన్యంలో మాత్రం ఆ మార్పు రాదు.

ఆరున్నర దశాబ్దాలుగా కంటిమీద కురుపులా పాకిస్థాన్ మనల్ని ఇబ్బంది పెడుతూనే వుంది. కాశ్మీర్ మీద కోరికతో ఇప్పటికే మూడుసార్లు మనతో యుద్ధానికి దిగి చేతులు కాల్చుకున్నా కూడా ఆ దేశానికి బుద్ధిరాలేదు. కాశ్మీర్‌ను కబళించాలనే కసి, కోరిక ఆ దేశంలో అంతకంతకు పెరుగుతూనే వున్నాయి. దాయాదితో శత్రుత్వమెందుకని మనం చేసే ప్రతి శాంతి ప్రయత్నానికి ఆ దేశం గండి కొడుతూనే వుంది. మనం పాక్‌కు స్నేహహస్తం చాచినప్పుడల్లా అవతలివైపు నుండి ఆ చేయిని నరికే ప్రయత్నాలే జరుగుతున్నాయి. మనం పాకిస్థాన్‌కు బస్సులు, రైళ్లు నడిపితే, వాళ్లు ఆ బస్సులు, రైళ్లలో తీవ్రవాదులను ఎక్కించి మన మీదకు తుపాకులిచ్చి తోలుతున్నారు. మనం శత్రుత్వం వీడి క్రికెట్ ఆడుతామని ఆహ్వానిస్తే వాళ్లు మాత్రం పార్లమెంటుమీద దాడులు, ముంబై వంటి మారణహోమాలతో పేట్రేగిపోతున్నారు. శాంతి స్థాపన దిశగా మనం నాలుగడుగులు వేస్తే కనీసం ఆ వైపు నుండి ఒక అడు గన్నా పడాలి. అప్పుడే ఆ ప్రయత్నం ఒక కొలిక్కి వచ్చే అవకాశముంటుంది. కాని మనం తపించిపోవడం తప్పితే పాక్‌వైపు నుండి ఎప్పుడూ ఆ స్పందన లేదు. అలాంటప్పుడు ఆ దేశాన్ని నమ్ముకోవడం దండగే!

భారత్‌వైపు నుండి శాంతిప్రక్రియ ప్రారంభమైనప్పుడల్లా పాకిస్థాన్ నుండి ఏదో ఒక కిరాతక చర్య చోటుచేసుకుంటూనే వుంటుంది. దానికి ఉదాహరణే ఇటీవల సరి హద్దుల్లో పాక్‌సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి భారత సైనిక శిబిరాలపై దొంగదాడి చేసి ఇద్దరు జవాన్‌లను హతమార్చి, వీరిలో ఒకరి తలను నరికి తీసుకుపోవడం. పాక్ సైనిక పైశాచికత్వానికి ఇది పరాకాష్ఠ. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ పాక్ సైన్యం తరచూ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతూనే వుంది. పాక్ కిరాతక చేష్టలకు భారత సైన్యం తలచుకుంటే గంటలో జవాబివ్వగలదు. సరిహద్దులో భారత్ సమరశంఖం మోగిస్తే పాకిస్థాన్ చెవులకు చిల్లు పడాల్సిందే!

ఇక్కడ తేడా ఒక్కటే. భారత సైన్యానికి పరిమితులున్నాయి. ఆంక్షలున్నాయి. క్రమశిక్షణ వుంది. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వ యంత్రాంగ పరిధిలో భారత సైన్యం పనిచేస్తుంది. పాలకుల నుండి ఆదేశాలు అందితే గాని మన సైనికుల చేతుల్లో తుపాకులు గర్జించవు. కాని పాక్ సైన్యం పరిస్థితి అది కాదు. అక్కడి ప్రభుత్వాలు, పాలకులు సైన్యం చేతుల్లో కీలుబొమ్మలు. సైన్యానికి ఎదురు తిరిగితే పాలకులు పదవీచ్యుతులు కావాల్సిందే. అక్కడ సైన్యం ఆడిందే ఆట, పాడిందే పాట. కాబట్టి అక్కడి ప్రభుత్వంతో మనం శాంతి చర్చలు జరిపినా ప్రయోజనం శూన్యం. మరి పాకిస్థాన్ సైన్యంలో మన పట్ల సానుకూల దృక్పథం వుందా? అంటే అదీ లేదు. పాక్ సైన్యం నిలువెల్లా భారత వ్యతిరేకతను పెంచుకుంది. పాకిస్థాన్ సైన్యాన్ని ప్రభుత్వం ఆదేశించ లేదు. కాని పాకిస్థాన్‌లోని తీవ్రవాద సంస్థలు, ఐఎస్ఐ ఆదేశించగలవు. సైన్యం, తీవ్రవాద గ్రూపులు కలిసే మన మీద యుద్ధం ప్రకటిస్తున్నాయి. అక్కడి ప్రభుత్వం, పాలకుల చేతిలో ఏమీ లేదు. పాక్ సైన్యం శాంతియుత వాతావరణానికి ముందుకురాదు. విషనాగుకు ఎన్ని పాలుపోసినా అది విషం కక్కుతుందేగాని అమృతం కాదు. పాకిస్థాన్ అంతే... మనం ఎంతగా స్నేహహస్తం చాచినా అది ఆ చేయిని కాటేసే గుణం మానుకోదు. కాబట్టి పాక్‌కు కుక్కకాటుకు చెప్పుదెబ్బలాంటి సమాధానంతోనే దారిలో పెట్టాలి.

## 'అంతర్'జాతీయం

- సరిహద్దుల వెంట పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే భారత్ ఇతర మార్గాలను పరిశీలించాల్సి వస్తుందని భారత వైమానికదళ చీఫ్ ఎన్.ఎ.కె.బ్రౌనే హెచ్చరించారు. న్యూఢిల్లీలో ఎన్‌సిసి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సరిహద్దుల్లో గత కొన్ని నెలలుగా జరుగుతున్న కార్యక్రమాలు ఎంతమాత్రం ఆమోదయోగ్యంగా లేవన్నారు.
- ప్రభుత్వ నిస్సహాయతే కోర్టుల్లో కేసులు పెండింగ్‌కు ప్రధానకారణమని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకూర్ అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా కోర్టుల సంఖ్యను 14వేల నుండి 18,847కు పెంచాల్సి వుందన్నారు.
- అమెరికాకు చెందిన ఆన్‌లైన్ ఉద్యమకారుడు ఆరాన్‌స్వార్ట్జ్ (26) ఆత్మహత్య చేసుకున్నారు. న్యూయార్క్‌లోని బ్రూక్లిన్ ప్రాంతంలోగల తన అపార్ట్‌మెంట్‌లో ఆయన ఉరివేసుకుని చనిపోయారు. చిన్నవయసులోనే కంప్యూటర్ దిగ్గజంగా ఎదిగిన ఆయన ఆన్‌లైన్‌లో సమాచారాన్ని ప్రజలకు ఉచితంగా అందించేందుకు పోరాడాడు.
- మాజీరాష్ట్రపతి ప్రతిభా పాటిల్ పదవీవిరమణకు ముందు చేసిన చివరి విదేశీ పర్యటనకు 18.08కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారహక్కు చట్టం ద్వారా వెల్లడైంది. 2011 ఏప్రిల్ 29 నుండి మే 8వ తేదీ వరకు ఆమె దక్షిణాఫ్రికా, సీషెల్స్‌లో పర్యటించారు. ఎయిర్ ఇండియా బోయింగ్ విమానం అద్దె క్రిందే 16.38కోట్లు చెల్లించారు. ఆమె రాష్ట్రపతిగా వున్న ఐదేళ్లలో 12సార్లు విదేశీ పర్యటనలు చేయగా 205కోట్లు ఖర్చయ్యింది.
- అత్యాచార నిందితులకు జీవితఖైదు, జరిమానా వంటి శిక్షలు చాలని, ఉరి శిక్షలు విధిస్తే నిందితులు బాధితులను చంపే ప్రమాదముందని జాతీయ మైనార్టీ కమీషన్ అభిప్రాయపడింది. అత్యాచార కేసుల్లో ట్రయల్‌కోర్టులు 100రోజుల్లోగా విచారణ పూర్తిచేసేలా చూడాలని కమీషన్ కోరింది.
- అన్నెంపున్నెం తెలియని మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్యకేసులో నిందితుడికి ఢిల్లీలోని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు మరణశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పింది. రెండేళ్ల క్రితం ఢిల్లీలో భరత్‌సింగ్ అనే ఓ ఫామ్‌హౌస్ గార్డ్ రిక్షాకార్మికుడి 3ఏళ్ల కూతురిని అత్యాచారం చేసి బలికొన్నాడు.
- అణు విద్యుత్ కోసం ప్రజల భద్రతను ప్రమాదంలో పడేయబోమని ప్రధాని మన్మోహన్‌సింగ్ పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలోని ప్రధాని నివాసంలో నలుగురు అణు శాస్త్రవేత్తలకు జీవితకాల సాఫల్య అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ జపాన్‌లోని ఫుకుషిమా అణువిద్యుత్ కేంద్ర ఘటనను దృష్టిలో పెట్టుకుని అణు ఇంధనం పూర్తిగా సురక్షితంగా వుండేలా చర్యలు చేపడుతున్నామన్నారు.
- జార్ఖండ్, బీహార్, చత్తీస్‌గఢ్, ఒడిసా రాష్ట్రాలు యాంటీనక్సల్స్ దళాలను ఏర్పాటు చేసుకోనున్నాయి. ఈ దళాల ఏర్పాటుకు కేంద్రం నిధులు విడుదల చేస్తుంది.

## వార్త వ్యాఖ్య

వార్త :- చివరి అంకంలో తెలంగాణ. – తేల్చేందుకే కేంద్రం మొగ్గు.
వ్యాఖ్య :- *సినిమా క్లైమాక్స్‌కొచ్చిందన్నమాట!*

వార్త :- ఉరిశిక్షతో అత్యాచారాలు ఆగవు. – శంకరాచార్య.
వ్యాఖ్య :- *మరి ఆ స్వామిజీ ఎవరో చెప్పినట్లు కాళ్లమీద పడి వేడుకుంటే ఆగుతాయా?*

వార్త :- సాగునే నమ్ముకుంటే భావితరాలకు నష్టం. – చంద్రబాబు.
వ్యాఖ్య :- *జనం అందుకే... మిమ్మల్ని నమ్ముకుంటే కష్టమని కాంగ్రెస్‌కు అధికారాన్ని అప్పగించింది.*

వార్త :- చంద్రబాబును సీమాంధ్రలో తిరగనివ్వం. – పెడన ఎమ్మెల్యే జోగి రమేష్.
వ్యాఖ్య :- *ఆ పని చేయండి... తిరగలేక ఆయన కూడా ఇబ్బంది పడుతున్నాడు.*

వార్త :- కేంద్రంలో లెఫ్ట్ ప్రభుత్వం. ప్రాంతీయ పార్టీల మద్దతుతో ఏర్పాటు చేస్తాం. – బర్దన్.
వ్యాఖ్య :- *పగటికలలంటే ఇవే కదా!*

వార్త :- ఛార్జీల పెంపు డిస్కం ప్రతిపాదనే. – ముఖ్యమంత్రి కిరణ్.
వ్యాఖ్య :- *ప్రతిపాదనలు వారివి... పెంచేది మనము.*

వార్త :- విద్యుత్‌ఛార్జీలపై విశాల ఐక్యపోరాటాలు. – బి.వి.రాఘవులు.
వ్యాఖ్య :- *విశాల ఐక్యపోరాటాలంటే... జీవితాంతం చేస్తూనే వుంటారా?*

వార్త :- మీతో ఇక బంద్. – పాకిస్థాన్‌కు భారత ప్రధాని హెచ్చరిక.
వ్యాఖ్య :- *ఈ మాటలు ఎన్నిసార్లు అనలేదు!*

వార్త :- రాష్ట్రపతిని కలిస్తే ..గన్ బయటకొస్తాడా? – వి.హెచ్.
వ్యాఖ్య :- *సోనియాగాంధీని కలవాలనేగా మీరు చెప్పేది.*

వార్త :- ఆ ప్రసంగాల్లో గొంతు నాది కాదు. – అక్బరుద్దీన్ ఓవైసీ.
వ్యాఖ్య :- *ఎవరైనా డబ్బింగ్ చెప్పారా?*

వార్త :- అన్నదాతకు అండగా నిలవాలి. – ప్రణబ్.
వ్యాఖ్య :- *అండగా కాదు... అందరూ కలిసి ఎండబెడుతున్నారు.*

వార్త :- సమైక్యాంధ్ర ఉద్యమం వెనుక సీఎం. – హరీష్‌రావు.
వ్యాఖ్య :- *ఆయనకు అంత టాలెంట్ ఏడ్చిందా?*

వార్త :- హైదరాబాద్ కేసీఆర్ కుటుంబ జాగీర్ కాదు. – సమైక్యాంధ్ర ఐకాస గౌరవాధ్యక్షులు నరసింహారావు.
వ్యాఖ్య :- *వాళ్లు ఆ విధంగా మార్చుకోవాలనుకుంటున్నారు.*

PDF Compressor Free Version



# ధారాదత్తం

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే! ఈ అఖిలపక్షం మొక్కుబడి సమావేశం. దీనికి ముందే ఆంధ్రప్రదేశ్‌ను రెండుగా చేయాలని కాంగ్రెస్ అధిష్టానం సంకల్పించింది. తెలంగాణ ఉద్యమం తీవ్రస్థాయిలో జరుగుతుంది కాబట్టి రాష్ట్రాన్ని విభజించబోతున్నారనుకుంటే పొరపాటే! కాంగ్రెస్ తన రాజకీయ స్వార్థం కోసమే తెలంగాణ ప్రకటన చేయబోతుంది. ఈ విషయంలో తెలంగాణ కాంగ్రెస్ మంత్రులు, ఎంపీలు విజయం సాధించారు. 2014ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని వాళ్లు సోనియాగాంధీ చెవిన ఇల్లు కట్టుకుని నూరిపోసారు. జగన్ హవాకు రాష్ట్రంలో కాంగ్రెస్ తట్టుకునే పరిస్థితి లేదు. ఎన్నికలొస్తే సీమాంధ్రలోనే కాదు తెలంగాణలోనూ జగన్ పార్టీ మెజార్టీ సీట్లు గెలుస్తుంది. కనీసం రాష్ట్ర విభజన జరిగితే టీఆర్ఎస్‌తో జతకట్టి తెలంగాణలోనన్నా పార్టీని నిలబెట్టుకునే అవకాశముంటుందని టి-కాంగి నేతలు చేసిన వాదనలు హైకమాండ్ తలకెక్కాయి. జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోవడానికి కాంగ్రెస్ అధిష్టానం రాష్ట్ర విభజననే మార్గంగా ఎంచుకుంది.

నెలరోజుల్లో ఏదో ఒక విషయం చెబుతానన్న హోంమంత్రి షిండే నిజంగానే తెలంగాణ అంశాన్ని తెంచేయడానికి రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 28న కాని లేదా అంతకుముందే కాని షిండే నోటి నుండి ప్రకటన వెలువడనుంది. తెలంగాణ ఏర్పాటుకు కేంద్రం సానుకూలంగా వుందన్న సంకేతాలు ఇప్పటికే వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో సీమాంధ్ర నేతలు, అటు తెలంగాణ నేతలు తమ తమ వాదనలు వినిపించడానికి హస్తినలో వాలుతున్నారు.

**మజ్లిస్ కూడా కారణమా...** తెలంగాణ విషయంలో కేంద్రం ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకోవడం వెనుక మజ్లిస్‌తో కటీఫ్ కూడా ఒక కారణంగా కనిపిస్తుంది. మొన్నటివరకు కాంగ్రెస్‌తో కలిసిసాగిన మజ్లిస్‌పార్టీ ప్రత్యేక తెలంగాణను వ్యతిరేకిస్తూ వచ్చింది. ఇప్పుడు మజ్లిస్ కాంగ్రెస్‌కు దూరమైంది. తెలంగాణ ఏర్పాటుకు ఆ పార్టీ అభ్యంతరం పెట్టే పరిస్థితి కూడా లేకుండా పోయింది.

**విభజిస్తే ఎలా...** ఇప్పటివరకు జరిగిన రాష్ట్రాల విభజన వేరు... రేపు తెలంగాణ ఏర్పాటు వేరు. గతంలో కొత్తగా ఏర్పాటైన రాష్ట్రాలు కొత్తగా రాజధానులను ఏర్పాటు చేసుకున్నాయి. కాని తెలంగాణ అంశం అలా కాదు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా వున్న హైదరాబాద్ నగరం తెలంగాణ ప్రాంతంలోకే వస్తుంది. భౌగోళికంగా ఇది సీమాంధ్రకు అనుకూలం కాదు. కాబట్టి ఇప్పుడు సీమాంధ్రకే కొత్త రాజధాని కావాలి. హైదరాబాద్‌నే పదేళ్లపాటు ఇరు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా వుంచుతారు. ఈ కాలంలో ఉమ్మడి నిధులతో పాటు కేంద్రం నిధులతో సీమాంధ్రలో ప్రత్యేకంగా రాజధాని నగరాన్ని అభివృద్ధి చేస్తారు. పదేళ్ల తర్వాత ఏ రాష్ట్రానికి ఆ రాజధాని వుంటుంది. కాకపోతే హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేస్తారా లేక తెలంగాణకు రాజధానిని చేస్తారా అన్నది ప్రశ్నార్థకం.

మొత్తానికి రాష్ట్ర విభజన ఖాయమనే సంకేతాలు బలంగా వెలువడుతున్నాయి. ఇప్పటిదాకా ఒకే రాష్ట్రం, ఒకే సంస్కృతి అన్నట్లుగా సాగిన తెలుగుజాతి రెండు తెగలుగా విడిపోనుంది. తెలుగుతల్లి గుండెను రెండు ముక్కలు చేయడానికి కసాయి కేంద్రం కత్తి నూరుతోంది. 28వ తేదీ దగ్గరపడే కొద్ది ఆ కత్తి పదునెక్కుతుంది. తెలుగుజనులారా... హుషార్! ఒక ధీరోదాత్తుడిని ఎదుర్కోలేక రాష్ట్రాన్ని ముక్కలు చేసి ఇంకొకరికి ధారాదత్తం చేస్తోందీ కుటిలకాంగ్రెస్.

## సీమాంధ్రలో తగ్గిన ఆసక్తి

2009 డిసెంబర్‌లో కేంద్ర హోంమంత్రిగా వున్న పి.చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని చెప్పినప్పుడు సమైక్యాంధ్ర ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. అప్పటికప్పుడు 150మంది దాకా ఎమ్మెల్యేలు రాజీనామాలు చేసారు. సీమాంధ్ర అంతటా పెద్దఎత్తున ఉద్యమాలు రేగాయి. ఆ దెబ్బతో కేంద్రం భయపడి తెలంగాణ ప్రకటనను ఉపసంహరించుకుంది. అయితే ఆనాటి తెగింపు నేడు నాయకుల్లో కనిపించడం లేదు. సీమాంధ్ర మంత్రులకు, ఎంపీలకు తెలంగాణ ఏర్పాటు గురించి కాంగ్రెస్ అధిష్టానం ఇప్పటికే సమాచారం పంపినట్లు తెలుస్తుంది. కాబట్టే సమైక్యాంధ్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన టి.జి.వెంకటేష్, ఏరాసు ప్రతాప్‌రెడ్డి, బాలరాజు, ఆనం రామనారాయణరెడ్డి వంటి మంత్రులు కూడా తెలంగాణ విషయంలో కేంద్రం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి వుంటామని ప్రకటించారు. కాగా తెలంగాణ నాయకులు విజయోత్సవాలకు సన్నద్ధమవుతున్నారు. హైదరాబాద్ మంత్రులు దానం నాగేందర్, ముఖేష్‌గౌడ్‌లు మాత్రం హైదరాబాద్‌ను ప్రత్యేక రాష్ట్రం చేయాలనే డిమాండ్‌ను తెరమీదకు తెచ్చారు.

# ప్రకృతి నుండే క్యాన్సర్ వ్యాధి ఔషధాలు

**- డా॥రామారావు**



డా॥ రామారావుకు జ్ఞాపికను అందజేస్తున్న డా॥ మధుసూధనశాస్త్రి

ప్రకృతిలో లభించే మొక్కలలోని కొన్ని రసాయనాల నుండి క్యాన్సర్ వ్యాధికి ఔషధాలు రూపొందించడం జరిగిందని ప్రముఖ శాస్త్రవేత్త, హైదరాబాదులోని అవ్రా లేబరేటరీస్ ఛైర్మెన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డా॥ఎ.వి.రామారావు పేర్కొన్నారు. నెల్లూరులోని హోటల్ శివం ఇంటర్నేషనల్ 12వ తారీఖున జరిగిన డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు అవార్డు ప్రధానోత్సవ సభలో ఆయన పాల్గొని డా॥ఎల్లాప్రగడ సుబ్బారావు స్మారకోపన్యాసంచేశారు. క్యాన్సర్ వ్యాధి వలన శరీరంలోని ఏ భాగంలోనైనా కణాల పెరుగుదల అసమర్థంగా జరుగుతుందని చెప్పారు. ప్రపంచంలో మొట్టమొదటిసారిగా క్యాన్సర్ వ్యాధి గురించి ఈజిప్టు దేశంలో వివరించారని, తొలి క్యాన్సర్ ఆపరేషన్ క్రీ॥పూ॥500లో జరిగిందని ఆయన తెలిపారు. తన పరిశోధనల ద్వారా బిళ్ళ గన్నేరు(విన్‌కారోసియా) మొక్కలలోని అల్కలాయిడ్ల నుండి 'మేథోట్రెక్సేట్' అనే ఔషధాన్ని రూపొందించడం జరిగిందని పేర్కొన్నారు.

ఫౌండేషన్ ఛైర్మెన్ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రత్యామ్నాయ ఇంధన వనరుల శాస్త్రవేత్త డా॥ఎ.జగదీష్ ఈ అవార్డ్ పూర్వాపరాలను తెలియజేస్తూ, ప్రపంచంలో ఏ ఒక్క శాస్త్రవేత్తా డా॥ఎల్లాప్రగడ సుబ్బారావు రూపొందించినన్ని మందులు కనుగొనలేదని, ఆయన కారణజన్ముడు, కర్మయోగి, మందుల మాంత్రికుడని కీర్తించాడు. తెలుగుజాతి గర్వించదగిన శాస్త్రవేత్తలు డా॥ఎల్లాప్రగడసుబ్బారావు, ప్రొఫెసర్ యలవర్తినాయుడమ్మ అని ఆ మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్ళేందుకు వారి పేరిట ఫౌండేషన్‌లను నెలకొల్పామని వివరించారు. డి.డి.టి కనుగొన్న స్విస్ శాస్త్రవేత్త డా॥పాల్‌ముల్లర్‌కు నోబెల్ బహుమతి లభించిందని, తదుపరి డి.డి.టిని అమెరికాలో బాన్ చేశారని పేర్కొంటూ, అదే మానవాళి మనుగడకు దోహదపడే అనేక మందులు కనుగొన్న డా॥సుబ్బారావుకు నోబెల్ బహుమతి లభించకపోవడం శోచనీయమన్నారు. కనీసం మన ప్రభుత్వమైనా డా॥సుబ్బారావుకి పోస్థుమస్ భారత్ రత్న అవార్డ్‌నిచ్చి గౌరవించడం సబబని అభిప్రాయపడ్డారు.

ప్రముఖ సర్జన్, మాజీ ఐ.ఎమ్.ఏ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డా॥పి.మధుసూధనశాస్త్రి తన అధ్యక్షోపన్యాసంలో డా॥ఎల్లాప్రగడ సుబ్బారావు జీవిత విశేషాలను వివరించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమి జాయింట్ డైరెక్టర్, డి.ఐ.జి దుత్తముక్కల దామోదర్ మాట్లాడుతూ డా॥ఎల్లాప్రగడ సుబ్బారావును యుగపురుషుడిగా అభివర్ణించారు.

ఈ సందర్భంగా డా॥ఎ.వి.రామారావుకు డా॥ఎల్లాప్రగడ సుబ్బారావు అవార్డును ఫౌండేషన్ తరపున డా॥మధుసూధనశాస్త్రి, శ్రీ దామోదర్, డా॥ఎ.జగదీష్ ప్రదానం చేశారు. ఫౌండేషన్ కార్యదర్శి డా॥ఎమ్.సుబ్రహ్మణ్యం వందన సమర్పణ చేశారు.

# తీరిన కోరిక

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా పార్టీ అధ్యక్ష పదవిని కూడా వదులుకుని బీద రవిచంద్రకు అప్పగించారు. జిల్లా తెలుగుదేశంపార్టీకి సుదీర్ఘకాలం అధ్యక్ష బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించి తానేంటో, తన నాయకత్వమేంటో నిరూపించుకున్న సోమిరెడ్డికి ఇప్పుడు పార్టీలో సరైన గుర్తింపు లభించింది. తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరోలోకి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని తీసుకుంటూ ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారు. ఖమ్మంజిల్లాలో పాదయాత్రలో వున్న చంద్రబాబు 16వ తేదీ తనను కలిసిన సోమిరెడ్డికి స్వయంగా ఈ శుభవార్తను చెప్పారు.

తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరోలో మన జిల్లా నుండి స్థానం పొందిన రెండో నాయకుడు సోమిరెడ్డి. తెలుగుదేశం స్థాపించిన తొలిరోజుల్లో స్వర్గీయ బెజవాడ పాపిరెడ్డి పొలిట్‌బ్యూరోలో సభ్యుడిగా పనిచేసారు.

పొలిట్‌బ్యూరోలోకి అన్నివిధాలా అర్హుడు సోమిరెడ్డి. ఇప్పుడున్న వారిలో అందరికంటే కూడా సమర్థుడు. తన మేనమామ స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి దగ్గర రాజకీయ ఓనమాలు దిద్దుకున్న సోమిరెడ్డి తన రాజకీయ జీవితంలో ఆయన చూపిన బాటలోనే నడిచాడు. రాజకీయాలంటే పూలే కాదు, ముళ్లు కూడా వుంటాయని తెలిసిన వ్యక్తి. కాబట్టి కష్టకాలంలో కూడా తెలుగుదేశంను వదిలిపోలేదు. 1987లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఆయన 1992 నుండి తెలుగుదేశంపార్టీలో వున్నాడు. ఆనాడు సారా వ్యతిరేకోద్యమంలో జిల్లా అంతటా పాదయాత్ర నిర్వహించి ప్రజలను ఉద్యమ బాట పట్టించాడు. 1994, 99లలో సర్వేపల్లి నుండి ఎమ్మెల్యేగా గెలిచి చంద్రబాబు కొలువులో రెండుసార్లు మంత్రిగా పనిచేసారు. 2004, 2009లలో సర్వేపల్లి నుండి వరుసగా ఓడినా, గత ఏడాది కోవూరు ఉపఎన్నికలలో పరాజయం పాలైనా ఆయన అధైర్యపడలేదు. రాజకీయాలలో ధైర్యంగా ముందడుగులేస్తూనే వున్నాడు. పార్టీని ముందుకు తీసుకుపోవాలని చూస్తున్నాడు.

నాయకత్వ సమర్థతకు సత్కారంగానే సోమిరెడ్డికి పొలిట్‌బ్యూరోలో స్థానం దక్కింది. కాకపోతే ఎప్పుడో రావాల్సిన పదవి కొంచెం ఆలస్యంగానైనా రావడం అభినందనీయం. తనకు తన మేనమామ రాజకీయ గురువైతే తన మేనమామకి బెజవాడ పాపిరెడ్డి గురువు. తన గురువుకే గురువు కూర్చున్న స్థానానికి తాను ఎదిగిన సోమిరెడ్డికి శుభాకాంక్షలు.

## కార్యకర్తల సంబరాలు

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరోలో స్థానం లభించడంతో జిల్లాలో తెలుగుదేశం కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. సర్వేపల్లి, కోవూరు, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో తెలుగుదేశం కార్యకర్తలు, సోమిరెడ్డి అభిమానులు భారీగా బాణా సంచా కాల్చి తమ ఆనందోత్సాహాలను ప్రకటించారు. పలువురు నాయకులు సైతం సోమిరెడ్డికి అభినందన శుభాకాంక్షలు తెలిపారు.

# సెకండ్ ఇన్నింగ్స్

(3వ పేజీ తరువాయి)

పనులను ఆనం చేస్తున్నారని ప్రశంసించారు. ఇవన్నీ బొల్లినేని మరలా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్లు సంకేతాలు చూపిస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా నెల్లూరు పార్లమెంటు స్థానం, లేదా జిల్లాలోని ఏదో ఒక శాసనసభ స్థానం నుంచైనా పోటీ చేయించే యోచనలో ఆయన అభిమానులు, కార్యకర్తలు, కాంగ్రెస్ నేతలు ఉన్నట్లు సమాచారం.

# కళతప్పిన సంబరాలు

(3వ పేజీ తరువాయి)

ప్రత్యేకంగా చెప్పాల్సిందే. తనలోని టాలెంట్‌నంతా ఆరోజు చూపించేవాడాయన. పిలకాయలతో కలిసి గాలిపటాలు ఎగరేసుకునేవాడు. మహిళలతో కలిసి గొబ్బెమ్మల పాటలు పాడేవాడు. పుల్లఐస్‌లు చీక్కుంటూ, ముంతపప్పు తింటూ ఎంతో సరదాగా గడిపేవాడు. ఈసారి గొబ్బెమ్మలపండుగ సైతం ఆయన లేక కళావిహీనమైంది. మహాశివరాత్రి పండక్కి అయినా ఆయన సంపూర్ణ ఆరోగ్యవంతుడై రావాలని కోరుకుందాం.

# నయనానందకరంగా సాగిన తెప్పోత్సవం



కనుమ పండుగ సందర్భంగా నెల్లూరు నగరంలోని నలుమూలల్లో వున్న దేవాలయాల్లోని దేవతామూర్తులు విహారయాత్రకు బయలుదేరి భక్తులకు కనులవిందు చేసారు. పప్పులవీధిలోని విఘ్నేశ్వరుడు, మహాలక్ష్మి, స్టోన్‌హౌస్‌పేటలోని వరసిద్ధి వినాయకుడు, సాలివీధిలోని, భావనారాయణస్వామి, దర్గామిట్టలోని రాజరాజేశ్వరి, రంగనాయకులపేటలోని రంగనాథస్వామి, మూలాపేటలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరస్వామి తదితర మూర్తులు ఊరేగింపుగా తరలివచ్చి స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట, నవలాకులతోట, మైపాడురోడ్డు ప్రాంతాల్లో విడిదిచేసి భక్తులకు దర్శనమిచ్చారు.

కోలాహలంగా సాగే ఈ సంబరంలో సర్వాలంకార శోభితులైన దైవాలను దర్శించిన భక్తులు తీర్థప్రసాదములు స్వీకరించి తన్మయులయ్యారు. ఇదే రోజు రాత్రి మైపాడుగేటు వద్ద ప్రతి ఏడులాగే వైభవంగా జరిగే తెప్పోత్సవంలో శ్రీ భ్రమరాంబసమేత మల్లిఖార్జునస్వామి తెప్పలో కొలువుదీరి భక్తులకు కనువిందు చేశారు. మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ బాణాసంచా వేడుకతో సాగిన ఈ తెప్పోత్సవంలో లెక్కకు మిక్కిలిగా పాల్గొన్న భక్తులతో ఆ ప్రాంతం కిటకిట[illegible]. ప్రముఖ సినీనిర్మాత, నెల్లూరీయుడు సి.కల్యాణ్, నెల్లూరు నగర శాసనసభ్యులు ముంగ[illegible]రు శ్రీధరకృష్ణారెడ్డి, పురప్రముఖులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.



ఇటీవల ఆత్మకూరులో నిర్వహించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన మహోత్సవంలో మహిళలకు ఇందిరమ్మ ఇంటి పట్టాలను అందజేస్తున్న రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, రఘువీరారెడ్డి, పితాని సత్యనారాయణ, పక్కన జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్

# నెల్లూరు కబుర్లు

## నాయకులారా...

# ఓటుబ్యాంకు రాజకీయాలు మానుకోండి



కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు మైనార్టీల ఓట్ల కోసం నీచమైన రాజకీయాలు చేయడం తగదని బీజేపీ జాతీయ నాయకులు యం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. 15వ తేదీ నెల్లూరులోని తన ఇంట్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మైనార్టీలకు రక్షణ లేదన్నట్లు కాంగ్రెస్ కమ్యూనిస్టు నాయకులు మాట్లాడుతున్నారు. ఇది ఎంత మాత్రం పద్ధతి కాదు. మతం పేరుతో ఈ దేశంలో ఎవరూ వేధింపులకు గురికావడం లేదు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు మతానికి ఉగ్రవాదానికి ముడిపెడుతున్నాయి. ఏ మతానికి కూడా ఉగ్రవాదంతో సంబంధం లేదని, ఏ మతం కూడా ఉన్మాదాన్ని ప్రేరేపించదనే విషయం వాళ్లు తెలుసుకోవాలి. ఓట్ల కోసం హైదరాబాద్‌లో మతోన్మాద మజ్లిస్‌ను పెంచి పోషించిన ఘనత కాంగ్రెస్‌పార్టీదే! హైదరాబాద్‌లో వాళ్లు ఎన్నో ఆగడాలకు పాల్పడ్డారు. తస్లీమానస్రీన్‌పై దాడి చేసారు. డాక్టర్లను కొట్టారు. కార్పొరేషన్ సిబ్బందిపై కాల్పులు జరిపారు. కాని ఏ సంఘటనలోనూ ప్రభుత్వం స్పందించలేదు. దీనిని మజ్లిస్ అలుసుగా తీసుకుంది. హైదరాబాద్‌ను తమ అడ్డాగా మార్చుకోవాలనుకుంటుంది. కాంగ్రెస్ రాజకీయాలు, మజ్లిస్ అరాచకాలతో హైదరాబాద్‌లో ఆందోళనకరమైన వాతావరణం నెలకొందని ఆయన అన్నారు. ఛార్మినార్‌ను మంచి కట్టడంగా చూడదానికి వెళితే, భాగ్యలక్ష్మి ఆలయానికి పూజలు చేసేందుకు వెళతారు. అక్బరుద్దీన్ ఓవైసీ ప్రసంగాలను ఆయన సోదరుడు అసదుద్దీన్ ఓవైసీ సమర్థించడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే. దేశంలో మెజార్టీలు, మైనార్టీలు అన్న భావాన్ని ప్రేరేపిస్తూ, మతపరంగా రిజర్వేషన్లను అమలు చేస్తుండడం వల్లే మత విద్వేషాలు రేగుతున్నాయని ఆయన అన్నారు. దేశంలో అందరూ భారతీయులే, అందరూ సమానమే అన్న భావనను కాంగ్రెస్ పెంచక పోగా, ఓట్ల కోసం ప్రజలను కులాల వారీగా, మతాల వారీగా విడదీస్తుందని దుయ్యబట్టారు. సరిహద్దుల్లో పాకిస్థాన్ సైన్యం జరిపిన కిరాతక చర్యను ఆయన ఖండిస్తూ పాక్ పట్ల ఇప్పటికైనా మెతక వైఖరిని వీడాలన్నారు.

## సి.ఎం.ఆర్‌లో ...

# సుహాసిని సందడి



లక్కీడ్రా తీసి విజేతను ప్రకటిస్తున్న సినీనటి సుహాసిని, పక్కన మావూరి వాసు, రాజీయాడ్స్ పెంచలయ్య

నెల్లూరులోని చందన బ్రదర్స్, సియంఆర్ షాపింగ్‌మాల్‌లో వారం వారం జరుపుతున్న వీక్లీ డ్రా విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఈ నెల 13న నెల్లూరు వాస్తవ్యురాలైన వర్ధమాన సినీనటి సుహాసిని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హీరో స్ప్లెండర్‌ను ఎన్.మునీశ్వరరావుకు, ఎల్‌సిడి టివిని సునేంద్రకు, వాషింగ్‌మిషన్‌ను డి.కళ్యాణ్‌కు, గ్రైండర్‌ను బి.వీరారెడ్డికి, డీవీడిని రోహిత్‌కు, మైక్రోఓవెన్‌ను వెంకటేష్‌కు ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంత ఊరిలో సంక్రాంతి సంబరాలలో భాగంగా ఈ కార్యక్రమాలలో పాల్గొనడం ఎంతో ఆనందంగా వుందని అన్నారు. 'చంటిగాడు' సినిమాతో ప్రారంభమైన సినీజీవితం సంతోషంగానే వుందని, అటు సినిమాల్లోనూ, ఇటు టివి సీరియళ్ళలోనూ నటిస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం ఒక తెలుగు సినిమాతో పాటూ తమిళ్‌లో హీరో విశాల్‌తో "అడ్డా" సినిమాలోనూ నటిస్తున్నానని తెలిపారు. అపరంజి టీవీ సీరియల్లో సియంఆర్ వస్త్రాలే తాను ధరించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా సియంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 26న బంపర్‌డ్రా నిర్వహిస్తామని అప్పటిలోపు సియంఆర్‌లో కొనుగోలు చేసిన వినియోగదారులకు ఈ డ్రాలో బహుమతులుంటాయని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ వాసు, రాజీయాడ్స్ పెంచలయ్య మొదలగువారు పాల్గొన్నారు.

# ర్యాంపులు లేపేశారు

సంతోషం! ఎట్టకేలకు నెల్లూరు నగరపాలక సంస్థ అధికారుల్లో చలనం కలిగేలా చేసిన ర్యాంప్‌లకు వందనం! ట్రాఫిక్ సమస్యలతో సతమతమైపోతున్న నగరవాసులకు ఊరట కలిగించేలా నగరంలోని కేవీఆర్ పెట్రోల్‌బంకు నుంచి పొదలకూరురోడ్డుకు వెళ్ళే దారిలోగల కల్యాణ మండపాలు, అపార్ట్‌మెంట్ల వద్ద రోడ్డుపై నిర్మించివున్న ర్యాంపులను తొలగించే చర్యలను అధికారులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. ఇక్కడ రోడ్డు వెడల్పు చేయనున్నట్టు ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమీషనర్ ఆంజనేయులు తెలిపారు. అలాగే మినీబైపాస్ రోడ్డులోని కల్యాణమండపాలు, కట్టడాల ముందు రోడ్డు ఆక్రమిస్తూ చేసిన నిర్మాణాలను తొలగిస్తామని తెలిపారు. తాత్కాలిక షెడ్ల నిర్మాణంగా కర్రలతోవేసిన నిర్మాణాలను తొలగించే చర్యలు అధికారులు చేపట్టారు. పండుగ తర్వాత మినీబైపాస్ రోడ్డులో ఆక్రమణలను తొలగించేందుకు వారు సమాయత్తమవుతున్నారు. నెలాఖరులోపు ఈ పని పూర్తి చేస్తామని కమీషనర్ ఆంజనేయులు తెలిపారు. ఎటువంటి రాజకీయ వత్తిళ్ళకు లొంగకుండా నగరంలోని అన్ని చోట్లా ఇటువంటి చర్యలు తీసుకొని దురాక్రమణలను తొలగిస్తే రోడ్లు విశాలం అవుతాయి. అదే క్రమంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, వాహనాలు రవాణా నియమావళి ప్రకారం చోదకులు నడిపేలా జిల్లా ఎస్పీ కూడా చొరవ చూపిస్తే నెల్లూరు నగరవాసులు చాలా సంతోషిస్తారు.

# ప్రభుత్వానికి బుద్ధిచెప్పడం ఖాయం



ముగ్గులను తిలకించి ప్రసంగిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

దివంగత మహానేత వైఎస్సార్ పరిపాలనా కాలంలో ఒక్క పైసా కూడా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని, కాని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 42వేల కోట్ల రూపాయల పన్నులు భారం ప్రజలపై మోపిందని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుజబుజనెల్లూరులోని బాలాజీకాలనీలో ఈనెల 13న "జగనన్నరావాలి" నినాదంతో మహిళలంతా సామూహికంగా తీర్చిదిద్దిన సంక్రాంతి ముగ్గుల కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ సమయంలో ఎన్నికలొచ్చినా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకిరావడం ఖాయమని, జగన్మోహన్ పాలనలో ప్రజలు సుభిక్షంగా, సురక్షితంగా వుంటారని అన్నారు. కార్యక్రమంలో నెల్లూరురూరల్ మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ పిగిలాం రమేష్, నాయకులు నగళ్ళ రామకృష్ణ, చలమయ్య, బాలయ్య, శ్రీహరినాయుడు, సుజనమ్మ, వసంతమ్మ, లక్ష్మయ్య మొదలగువారు పాల్గొన్నారు.

# కమనీయం శ్రీవారి కల్యాణం



తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూధర్మప్రచారపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని టిటిడి కల్యాణ మండపంలో దేవేరుల సమేత శ్రీనివాసుని శ్రవణానక్షత్ర కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. ఈ మహోత్సవానికి ఉభయకర్తలుగా వాకాటి విజయకుమార్‌రెడ్డి, ఇ.మురళీధర్‌రెడ్డి వ్యవహరించారు. చెరుకుపల్లి తిరుపాల్‌రెడ్డి స్వామివారికి అభిషేక శంఖు, చక్రాలను సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో, మంగళవాయిద్యాలతో శ్రీవారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది.

శ్రీ గురుకృప కళాక్షేత్రం విద్యార్థినులు తనుశ్రీ సిస్టర్స్ భరత నాట్యనృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వీరిశెట్టి సుధాకర్, అర్చకులు ఫణిశర్మ, నాగేంద్రశర్మ, గోవింద గిరిధర్ పాల్గొన్నారు.

# వైభవంగా బీద జన్మదినోత్సవం



రవిచంద్రను సత్కరిస్తున్న అభిమానులు

తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర జన్మదిన వేడుకలు 11వ తేదీ నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో వేడుకగా జరిగాయి. ముందుగా రవిచంద్ర తేదేపా వ్యవస్థాపకుడు ఎన్.టి.రామారావు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా నాయకులు, కార్యకర్తల మధ్య కేక్‌కట్‌చేసి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యకర్తలు గజమాలతో రవిచంద్రను సన్మానించారు.

కిలారి వెంకటస్వామి నాయుడు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అంచల వాణి, నూనె మల్లికార్జునయాదవ్, శింగంశెట్టి రవిచంద్రలు బీదకు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జూబ్లీ ఆసుపత్రిలో టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు రోగులకు పండ్లు పంపిణీచేశారు. జిల్లా మైనార్టీ శాఖ అధ్యక్షుడు ఎస్.కె.భాషా, షేక్ కామిల్‌బాషా, ఆరిఫ్, జాఫర్, రఫీ, షమీమ్, నగరఅధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, సాయికిషోర్, దత్తుయాదవ్, అశోక్, టిఎస్ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు తిరుమలనాయుడు రవిచంద్రకు శుభాకాంక్షలు తెలిపారు.

PDF Compressor Free Version



సింహపురి సమాచారం

## జోరు తగ్గని పందెంకోళ్లు
# సత్తా చూపిన పోలీసోళ్లు



*జూదం అంటే మనిషికి మక్కువ మరీ ఎక్కువ. ఆ జూదంతోనే అలనాడు కురుక్షేత్ర యుద్ధం వచ్చింది. పాండవులు, కౌరవుల మధ్య విభేదాలకు ఆజ్యం పోసింది ఆ జూదమే.*

*అయినా ఈ జూదం బహురూపాలలో నేటికీ దర్శన మిస్తోంది. మనిషిని దాని మత్తులో మకిలపడేలా చేస్తోంది. మలినమయ్యేలా చూస్తోంది. ముఖ్యంగా పండుగ వచ్చిందంటే దాని జోరు చెప్పనలవికాని అంశం.*

పేకాట, కోడిపందాలు, ఎడ్లపందాలు తదితర రూపాలలో జనంలో ఉత్సాహాన్ని నింపుతుంది. ఆ ఉత్సాహం, ఆరోగ్యకరంగా, ఆహ్లాదకరంగా సాగితే సంతోషమే. కాని కొన్ని సందర్భాల్లో కక్షలు, కార్పణ్యాలకు కారణభూతంగా నిలిచి, గ్రామాలకు గ్రామాలు తగలబడేలా చేస్తుంది. అందుకే ప్రభుత్వం వీటిని నిషేధించి, వాటిని నిరోధించే చర్యలు చేపడుతుంది. కాని చెప్పుకోతగ్గస్థాయిలో వీటిని అరికట్టలేకపోతోంది. కారణం పందెంకాసి గెలుపు సాధించడంలో వుండే ఆనందం మరి దేనిలోనూ పందెంరాయుళ్లకు లభించకపోవడం ఒకెత్తయితే గ్రామీణులలో దానిని చూసి ఆనందించే ప్రజల శాతం ఎక్కువగా వుండడం మరోఎత్తు.

మొత్తంమీద ఈసారి సంక్రాంతికి కూడా జిల్లాలోని పలుప్రాంతాలలో కోడిపందేలు, పేకాట విశేషస్థాయిలో జరిగాయి. పోలీసులు కూడా పెద్దఎత్తున దాడులు నిర్వహించి కొంతమందిని అరెస్టుచేయడం, కోళ్ళు, నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకోవడం జరిగింది. కోట మండలం రామాపురంలో భోగిరోజున కోట ఎస్‌ఐ మాలకొండయ్య, కోడిపందేలు ఆడుతున్న ప్రదేశంలో దాడిచేసి 17కోళ్ళు, రెండు సెల్‌ఫోన్‌లు, 1000రూపాయల నగదు స్వాధీనం చేసుకొని 9మందిని అరెస్ట్ చేశారు. సంగం మండలం అన్నారెడ్డిపాళెం పంచాయితీ పల్లిపాళెం దగ్గర పెన్నానదిలో కోడిపందెల స్థావరంపై దాడిచేసి 6మందిని, దువ్వూరు దగ్గర పేకాటస్థావరంపై దాడిచేసి 8మందిని పోలీసులు అరెస్ట్‌చేశారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు పల్లిపాళెం దగ్గర పెన్నానది తీరంలో సిఐ సాంబశివరావు పోలీసు సిబ్బందితో దాడిచేసి 8మంది పందెంరాయుళ్ళని అరెస్ట్‌చేసి 1700రూపాయల నగదు 3కోళ్ళను స్వాధీనం చేసుకున్నారు. చిట్టమూరు మండలం కోగిలి చెరువులో ఎస్‌ఐ నాగభూషణం పోలీసు సిబ్బందితో దాడిచేసి నలుగురిని అరెస్ట్ చేసి మూడు కోళ్ళను 500రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇలా జిల్లాలో కోడిపందాలు ఆడుతున్న జూదరులు సుమారు 168మందిని అరెస్టు చేసి 146పందెపుకోళ్ళు, 60వేల నగదు, 27మోటారుసైకిళ్ళు, 10సెల్‌ఫోన్లు, 18కోడికత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పేకాటస్థావరాలపై దాడులుచేసి 45మంది పేకాటరాయుళ్ళని అరెస్ట్‌చేసి 29వేల నగదు 7సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కోవూరులో ప్రతి ఏటా జరిపే ఎడ్లపందేలను పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు, ప్రతిఘటించారు. దీనిపై వారి మధ్య వాగ్వివాదం జరిగింది. ఎట్టకేలకు హైదరాబాద్‌స్థాయిలో గ్రామస్తులు ఫోను ద్వారా పోలీసులకు ఆదేశాలు వచ్చేలా చేయడంతో చివరికి యథావిధిగా ఎడ్లపందేలు జరిగాయి. అయితే ఎడ్లపందేల నిర్వాహకులపై జంతు సంరక్షణ చట్టంకింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కనపడని భోగభాగ్యాల సంక్రాంతి

**మకర రాశిలోకి సూర్యుడు ప్రవేశించే శుభఘడియలకు సిద్ధమవడమే భోగి పండుగ. దక్షిణాయానాన్ని సాగనంపి, ఉత్తరాయణంలోకి రావడమే భోగి. భోగి అంటే సుఖం, ధ్యానం, ధనం, భోగం, రక్షణ, ప్రసాదం ఇలా మనిషికి మంచి చేసే పరమార్థాలన్నీ విలసిల్లే పర్వదినమిది.**

సకలభోగ భాగ్యాలనిచ్చే భోగిపండుగను ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. రైతులు పండించిన పంట భోగినాటికి ఇంటికి చేరుకోవడమే భోగి అనే అర్థం వచ్చిందని పురాణాలు చెబుతున్నాయి. నగరంలో వాడవాడలా ప్రతి ఇంటి ముంగిట, ప్రధాన రోడ్ల సెంటర్లో తాటాకులు, పనికిరాని వస్తువులతో భోగి వేస్తారు. తలకు నువ్వులనూనె పెట్టుకుని, భోగిమంటలో నీళ్ళు కాచుకుని స్నానంచేసి కొత్తబట్టలు కట్టుకుని పూజాది కార్యక్రమాలను నిర్వహించి బంధుమిత్రులతో కలసి ఆనందోత్సాహాలతో గడుపుతారు. సాయంత్రం చిన్నపిల్లలకు భోగిపళ్ళు పోసి దిష్టితీసి పెద్దలు ఆశీర్వదిస్తారు. పిల్లలకు భోగిపళ్ళు(రేగిపళ్ళు) పోయడం ద్వారా సూర్యానుగ్రహం కలుగుతుందని నమ్మకం. గోదాదేవి తిరుప్పావై వ్రతాన్ని ఆచరించి శ్రీ రంగనాథునిలో ఐక్యం అయింది ఈరోజునే. గతంలోలాగా భోగిమంటలు వేయడం చాలా వరకు తగ్గింది. వి.ఆర్.సిసెంటర్, పొగతోట సెంటర్, చాకలివీధి సెంటర్, సంతపేట సెంటర్ ఇలా ప్రధాన సెంటర్లలో గతంలో పెద్దపెద్ద మానులు వేసేవాళ్ళు. కాని అంత ఉత్సాహం నేడు కానరాలేదు.



**నాటి సంక్రాంతి కళ...నేడేది...** ఒకప్పుడు ఎంతో వైభవంగా, ఘనంగా జరిగే సంక్రాంతి పండుగ రానురాను కళతప్పింది. గతంలో సంక్రాంతి అంటేనే ప్రాచీన సాంప్రదాయాలు, కళలతో ఇంటిల్లిపాది ఎంతో ఆనందంతో కళకళలాడేది. కాలగమనంలో రానురాను ఆ వైభవం కనుమరుగై పండుగలు కళాహీనంగా కన్పిస్తున్నాయి. పల్లెల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సంక్రాంతి సంబరాలను పరిశీలిస్తుంటే ఆనందంకంటే ఆవేదన ఎక్కువ అవుతోంది. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం, కరువు కారణంగా పొలాల దుస్థితిని చూసి దిగులుపడుతున్న రైతులు, ఎటుచూసినా నిరాశ నిస్పృహలతో పండుగ ఉత్సాహం కనిపించడంలేదు. అయినప్పటికి కొద్దోగొప్పో పెద్దపండుగను ఒక మోస్తరుగా జరుపుకున్నారు. నగరంలో అన్ని దుకాణాలు ఆదివారం సాయంత్రం జనంతో కిటకిటలాడాయి. ప్రధానంగా ట్రంకురోడ్డు, కాపువీధి, చిన్నబజారు, పెద్దబజారు, స్టోన్‌హౌస్‌పేట, సండేమార్కెట్, సుబేదారుపేట తదితర ప్రాంతాల్లోని అన్ని దుకాణాలు రద్దీగా కనిపించాయి. ప్రధాన రోడ్లన్నీ ట్రాఫిక్‌తో నిండిపోయాయి.



ఈ నెల 15వ తేదీన కోవూరు సహకార చక్కెర కర్మాగారాన్ని పరిశీలించి అక్కడి రైతులతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్

# స్వర్ణభారత్‌లో సంక్రాంతిశోభ




సమావేశంలో ప్రసంగిస్తున్న యం.వెంకయ్యనాయుడు

భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడడంలో వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ తన ప్రత్యేకతను చాటుకుంటుంది. బీజేపీ అగ్రనేత యం.వెంకయ్యనాయుడు ముద్దుల తనయ ఐ.దీపావెంకట్ సారథ్యంలో నడిచే ఈ ట్రస్ట్ కార్యకలాపాలలో వెంకయ్యనాయుడు ఆలోచనలు, ఆశయాలు అడుగడుగునా కనిపిస్తాయి. భారతీయ పండుగలను ప్రతియేటా ఎంతో వేడుకగా జరపడం ఈ ట్రస్ట్ ఆనవాయితీగా చేస్తుంది. ఈ పరంపరలో భాగంగానే ఈ సంవత్సరం సంక్రాంతి వేడుకలు 11వ తేదీ ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కర్ణాటక ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి అశోక్ తెలుగు ప్రజలకు కన్నడ ప్రజల తరపున సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ శ్రీ కృష్ణదేవరాయులు కాలం నుంచి ఆంధ్ర, కర్ణాటక ప్రజలు సోదరభావంతో జీవనం సాగిస్తున్నారన్నారు. తెలుగు ప్రజలలాగానే తాము కూడా మకరసంక్రాంతిని జరుపుకుంటున్నామన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను మరువకుండా గాంధీజీ ప్రబోధించినట్టు వెంకయ్యనాయుడు స్వర్ణభారత్‌ట్రస్టును స్థాపించడం ఆనందదాయకమని, ట్రస్టు సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. బిజేపీ జాతీయనేత వెంకయ్యనాయుడు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టుకోవడంతో పాటు కుటుంబవ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు పండుగలు ఉపయోగపడతాయన్నారు. ఆర్.ఎస్.ఎస్.జాతీయ అధికార ప్రతినిధి రాంమాధవ్ మాట్లాడుతూ సంక్రాంతి గ్రామాల పండుగని, చలితగ్గి, వెలుగు పెరిగి, పంటలు చేతికొచ్చే పండుగ సంక్రాంతి అని అన్నారు.

తొలుత కర్ణాటక ఉపముఖ్యమంత్రి అశోక్‌కు స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన అక్షర విద్యాలయం, ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలను, సైరడ్, ఆసుపత్రులను పరిశీలించారు. సంక్రాంతి సంబరాల కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, వివేకానందునిపై వ్యాసరచన పోటీల విజేతలకు ప్రముఖుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ప్రముఖ సినీగాయకుడు మనో(నాగూరుబాబు) బృందం, టీనాకమల్ ఆలపించిన మధురగీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కర్ణాటక ఎంపి పిసి మోహన్, కర్ణాటక మాజీమంత్రి కట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, బిజెపి రాష్ట్ర నేతలు, హరిబాబు, చల్లపల్లి నరసింహారెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ సుకుమార్, రాంమాధవ్ జిల్లాకు చెందిన శాసనసభ్యులు బీదమస్తాన్‌రావు, కురుగొండ్ల రామకృష్ణ, జిల్లా ఎస్.పి రమణకుమార్, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని క్రిష్ణయ్య, చెన్నై, హైదరాబాదు వంటి నగరాలతో పాటు ఇతర నగరాల నుండి వచ్చిన వెంకయ్య అభిమానులు పాల్గొన్నారు.

# అవినీతి కాంగ్రెస్‌కు అంతిమఘడియలు

అసమర్థ అవినీతి కాంగ్రెస్ పార్టీకి చివరి రోజులు దగ్గర పడ్డాయని తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు బీదా రవిచంద్ర ధ్వజమెత్తారు. విద్యుత్ ఛార్జీలు, సర్‌ఛార్జీలు ఇతర పన్నులను తగ్గించాలంటూ 12వ తేదీ నెల్లూరులో తేదేపా నగర కమిటీ అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో భారీ స్కూటర్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ నర్తకిసెంటర్ ఎన్.టి.రామారావు విగ్రహం నుండి ప్రారంభమై గాంధీబొమ్మ, విఆర్‌సీ, లీలామహల్, ఆర్డీవో, పెద్దబజారు, చిన్నబజారు, ములుమూడి బస్టాండ్, సంతపేట, మీదుగా తిరిగి ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా బీదా రవిచంద్ర మాట్లాడుతూ వైఎస్సార్ అవినీతి విధానాలు కిరణ్ ప్రభుత్వం అసమర్థ పాలన వల్ల రాష్ట్రం దివాళా తీసిందన్నారు. రైతులు, కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. పరిశ్రమలు మూతపడి రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తుందన్నారు. ఆర్‌టీసీ, గ్యాస్, పెట్రోలు, ఎరువుల ధరలు విపరీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిందని దుయ్యబట్టారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో వ్యవసాయానికి 9గంటలు విద్యుత్తును ఇచ్చారని కాంగ్రెస్‌పాలనలో వైఎస్ నుంచి ఇప్పటి కిరణ్ సర్కారు వరకు అవినీతి రాజ్యమేలు[illegible]న్నారు. కార్యక్రమంలో టిడిపి పార్టీనాయకులు ధర్మవరపు సుబ్బారావు, వైవి సుబ్బారావు, భువనేశ్వరప్రసాద్, [illegible]న్వర్, మొహరుద్దీన్, మహేంద్రరెడ్డి, పడవల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



## కదంబం

# మట్టి, మనిషీ, సంతకం

రావెల పురుషోత్తమరావు
గుంటూరు, 93941 00531.

మట్టి మహిమాన్విత
పుట్టిన ప్రతి జీవికి
పుణ్యభూమిగా సాక్షాత్కరిస్తుంది
గిట్టిపోయిన వాళ్ళకు మాత్రం
మరుభూమియై గోచరిస్తుంది

మట్టి మాయలమరాఠీకాదు
మనసెరిగి ప్రవర్తించే మాతృమూర్తి
విత్తిన ప్రతి విత్తనాన్నీ
విస్తరించే దిశగా రక్షిస్తుంది.
కోతకొచ్చే దాకా పంటను
కడుపులో పెట్టుకు కాపాడుతుంది
మట్టి సేద్యగాండ్ర కళ్లల్లో
కాంతి దీపాలను వెలిగిస్తుంది
ఒడిదుడుకుల పాలినబడే బడుగు ప్రాణులకు
ఒద్దికను నేర్పి సంరక్షిస్తుంది
అందరికీ ఓరిమీ, సహనాలనలవరచి
సాఫీగా జీవితాలను సాగించేలా సాయపడుతుంది.
మట్టి మీద సంతకం చేసి మనుగడ సాగించే మనిషిని
మహిమాన్వితునిగా తీర్చి దిద్దుతుంది

# నెల్లూరులో జాతీయస్థాయి కవి సమ్మేళనం

**- జిల్లా రచయితల సంఘం**

నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జనవరి 20 ఉదయం 9గం॥లకు జాతీయస్థాయి కవి సమ్మేళనం జరుగుతుందని నెల్లూరుజిల్లాలో కవులు, సాహిత్యఅభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నెల్లూరుజిల్లా రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఏ.జయప్రకాష్, పాతూరు అన్నపూర్ణమ్మలు ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రకాశంజిల్లా రచయితల సంఘం

# రాష్ట్ర మహాసభలు

2013 ఫిబ్రవరి 8,9,10తేదీలలో ఒంగోలులో ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 7వ రాష్ట్ర మహాసభలు జరుగుతాయి. ఈ మహాసభలను కేంద్రమంత్రి శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎల్లూరి శివారెడ్డి, లోక్‌సత్తానాయకులు, డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పాల్గొంటారు. రాష్ట్ర నలుమూలల నుండి మహాసభలలో పాల్గొనే కవులు, రచయితలకు మూడురోజులు సాధారణ వసతి, భోజన సౌకర్యముం కల్పించబడుతుందని, ప్రతినిధి రుసుముక్రింద రూ.50/-లు చెల్లించాలని ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు బి.హనుమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# మకరజ్యోతి దివ్యదర్శనం

నెల్లూరు వేదాయపాళెంలోని స్వామి అయ్యప్ప దేవస్థానంలో సోమవారం రాత్రి మకరజ్యోతిని వెలిగించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని చేసిన స్వామియే..శరణమయ్యప్పా శరణుఘోషతో అయ్యప్ప దేవస్థానం పులకించింది. జిల్లా నలుమూలల నుండి భక్తులు వచ్చి జ్యోతిని దర్శించుకున్నారు. శబరిమలైలో ఏటా కనిపించే జ్యోతి దివ్యదర్శనం సమయానికి ఆలయంలో స్వామికి అఖండ కర్పూర హారతిని ఇచ్చారు. భక్తులు సమర్పించిన కర్పూరాన్ని ఆలయశిఖరంపై ఉంచి జ్యోతిని వెలిగించారు. ఆలయ ప్రధానార్చకుడు రాజీవ్ నంబూద్రి ఆధ్వర్యంలో స్వామివారికి విశేషఅభిషేకాలు నిర్వహించారు. డీఆర్‌ఉత్తమ హోటల్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీచేశారు. ఆలయకమిటీ ఛైర్మెన్ పిటి రంగరాజన్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీసభ్యులు శేషగిరిరావు, రత్నం, పాదర్తి బాలసుబ్రహ్మణ్యం, భక్తులు పాల్గొన్నారు.

# నెల్లూరు దోమలతో పాక్‌సైన్యం ఆట కట్

## గల్పిక

అది న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్. అక్కడ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీతో ప్రధాని మన్మోహన్ సింగ్, యూపిఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, రక్షణశాఖ మంత్రి ఏ.కె.ఆంటోని, హోంశాఖ మంత్రి సుశీల్‌కుమార్ షిండే, ఆర్మీ చీఫ్ విక్రమ్ సింగ్, నేవీ చీఫ్ బ్రౌనే లు సమావేశమయ్యారు. వాతావరణం చాలా గంభీరంగా వుంది. అందరి కళ్లలోనూ ఆవేదన, అంతకంటే కూడా ఆవేశం కనిపిస్తుంది. మన్మోహన్‌సింగ్ వుండి... పాక్ ఆగడాలను ఎంతకాలమని సహించగలం ప్రణబ్‌జీ... మన సరిహద్దుల్లోకి జొరబడి ఇద్దరు సైనికులను చంపేస్తారా... ఇక లాభం లేదు... కత్తికి కత్తి, కన్నుకు కన్ను సమాధానం చెప్పాల్సిందే అని ఆవేశంగా అన్నాడు. మన్మోహన్‌జీ కూల్... కూల్... మీ ఆవేశం చూస్తుంటే జేసెస్ కత్తి తీసుకుని యుద్ధానికి బయలుదేరినట్లుగా వుంది. మనది శాంతిభూమి... గాంధీజీ ఏం చెప్పాడో తెలుసా? అని సోనియా అంది. ఏమో నాకు తెలియదు. అప్పుడు నేను చిన్నపిల్లవాడినని మన్మోహన్ అన్నాడు. దానికి సోనియా... మీరు చిన్నపిల్లవాడే... నేనైతే అసలు పుట్టనే లేదు... ఒక చెంప మీద కొడితే రెండో చెంప చూపించమని గాంధీజీ అన్నారు. దానిని నేను పుస్తకాలలో చదివానని అంది. ఆ మాటకు ఆంటోని... అలా అందరికీ చెంపలు చూపిస్తూ పోబట్టే ప్రతి ఒక్కరూ మన చెంపలనే కాదు ఒళ్లను కూడా వాయకొడుతున్నారని వాపోయాడు. మనం క్రికెట్ ఆడుకుందాం రమ్మన్నాం... వాళ్లు మనతోనే ఆడుకుంటున్నారు. అలాంటి వాళ్లతో ఇక చర్చలు అక్కర్లేదు. శాంతి సంప్రదింపులు అవసరం లేదు. వెంటనే ఆ దేశం మీద యుద్ధం ప్రకటించండి మన తడాఖా ఏంటో చూపిద్దామని హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండే ఆవేశంగా అన్నాడు. మేం రెడీ అంటూ త్రివిధ దళాధిపతులు ఉత్సాహంగా లేచారు. అప్పుడు ప్రణబ్‌ముఖర్జీ కలుగజేసుకుని... ఆవేశంతోనే అన్ని పనులు జరుగవు... శత్రువును ఆయుధంతోనే కాదు, ఆలోచనతోనూ దెబ్బతీయవచ్చు. తుపాకులతో కాల్చుకుంటే ఒక సారికే చచ్చూరుకుంటారు. కాని శత్రువులు అలా చావడం నాకిష్టం లేదు. వాళ్ళు ప్రతిరోజూ బ్రతుకుతూ చావాలి. చస్తూ బ్రతకాలి. మన అమర జవాన్‌ల ఆత్మశాంతికి అదే అసలైన నివాళి. ఒక్క తూటా ఖర్చులేకుండా, ఒక్క బాంబు పేల్చకుండా, ఒక్క యుద్ధవిమానం కూడా ఎగరకుండా, ఒక్క సైనికుడు చావకుండా శత్రుదేశానికి బుద్ధి చెప్పాలి. మనం పాకిస్థాన్‌కు నేర్పే గుణపాఠాన్ని చూసి చైనా కూడా గడగడ వణకాలి అని అన్నాడు. దానికి సంబంధించి ఏదైనా మాస్టర్‌ప్లాన్ మీ దగ్గర వుందా? అని సోనియా అడిగింది. చెప్పేవాళ్లు చేయరు... చేసేవాళ్లు చెప్పరు. నేనేం చేస్తానో రెండ్రోజుల తర్వాత మీకే తెలుస్తుంది అని చెప్పి ముగించి అందరినీ పంపించేసాడు.

★★★★★

రెండ్రోజుల తర్వాత...

అన్ని అంతర్జాతీయ న్యూస్‌ఛానెల్స్‌లో ఒకటే ఫ్లాష్‌న్యూస్... సరిహద్దులో పాక్‌సైనికుల ఆర్తనాదాలు... ప్రాణభయంతో పరుగులు తీస్తున్న పాక్ ఆర్మీ.. మాకు ఉద్యోగాలు వద్దంటూ ఇళ్లకు వెళ్లిపోతున్న సైనికులు... మా సైనికుల ఆత్మస్థైర్యాన్ని భారత్ దెబ్బతీసిందని పాక్ అధ్యక్షుడు జర్దారీ ఆరోపణ... వింత రోగాలతో ఆసుపత్రుల పాలవుతున్న పాకిస్థాన్ సైనికులు... టీవీ ఛానెల్స్‌లో ఈ వార్తలు చూసేసరికి సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్, ఆంటోని, షిండేలకు మతిపోయినంత పనైంది. ప్రణబ్ ముఖర్జీ అన్నట్లే చేసాడు. అయితే ఏం చేసాడు? అనేది తెలుసుకోవాలనే కుతూహలం వారిలో పెరిగింది. వెంటనే అందరూ కలిసికట్టుగా రాష్ట్రపతిభవన్‌కు వెళ్లారు. అందరూ ప్రణబ్‌ముఖర్జీకి అభినందనలు తెలిపి, ఇదెలా సాధ్యమైంది సార్, పాకిస్థాన్ సైన్యాన్ని చెల్లాచెదురు చేసారు. మనవైపు కన్నెత్తకుండా చేసారు.. మాట నిలబెట్టుకున్నారు. ఈ క్రెడిట్ మీదే అని అన్నారు. ఆ మాటకు ప్రణబ్... నోనో... ఆ క్రెడిట్ నాది కాదు... వీరిది అని "ఆంజనేయులు" అంటూ కేకేసాడు. వెంటనే లోపల నుండి నెల్లూరు నగరపాలకసంస్థ కమీషనర్ ఆంజనేయులు, వారి సిబ్బంది, మాజీ మేయర్ భానుశ్రీ, మాజీ కార్పొరేటర్లు చాట్ల నరసింహారావు, సన్నపరెడ్డి పెంచలరెడ్డి, పిండి సురేష్, పుట్టా రామకృష్ణారెడ్డి, చక్రవర్తి, మేకల నరేంద్ర, రావుల జ్యోతి వచ్చారు. పాక్‌సైన్యం అలా కావడానికి వీరికి సంబంధమేంటని ఆంటోని అడిగాడు. చెబుతాను అంటూ... ప్రణబ్‌ముఖర్జీ అక్కడే వున్న టార్టాయిస్ కాయిల్‌ను ఆంటోని ముఖం ముందుపెట్టి గిర్రున తిప్పి ఫ్లాష్‌బ్యాక్‌లోకి తీసుకెళ్లాడు.

★★★★★

రాష్ట్రపతిగా ఎన్నికయ్యాక తొలిసారిగా ప్రణబ్‌ముఖర్జీ తిరుమలకు వచ్చాడు. రేణిగుంట ఎయిర్‌పోర్టులో రాష్ట్రానికి చెందిన సీఎం, గవర్నర్, మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయనకు స్వాగతం పలికారు. వారిలో స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి (64) కూడా వున్నాడు. ప్రణబ్, వివేకాతో ప్రత్యేకంగా మాట్లాడుతూ... వివేకా, నెల్లూరు స్పెషల్స్ ఏంటి అని అడిగాడు. ఇంతకుముందు చేపలపులుసు, మటన్‌బిర్యానికి నెల్లూరు స్పెషల్ సార్, కాని ఇప్పుడు వాటిని మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు మరిపిస్తున్నాయి అని వివేకా చెప్పాడు. అబ్బో అవి అంత గొప్పదోమలా? అని ప్రణబ్ అడిగాడు... దానికి వివేకా... అవి ఒకటి ఒకసారి కరిచిందంటే వందసార్లు కరిచి నట్లే... మా నెల్లూరులో డాక్టర్లందరూ బ్రతికేది ఆ దోమల ఆధారంతోనే... కత్తితో పొడిస్తే ఒక సారే నొప్పి పుడుతుంది. కాని అవి ఒకసారి కరిస్తే వందరోజుల దాకా నొప్పిపోదు. అంతే కాదు, డెంగీ, మలేరియా, ఫైలేరియాలతో పాటు ఎయిడ్స్, క్యాన్సర్ వంటి రోగాలు కూడా వస్తాయని చెప్పాడు. ఆ దోమలతో ఏ రోజన్నా పని పడితే నీకు ఫోన్ చేస్తాను వివేకా అని ప్రణబ్ అన్నాడు. సరేనని వివేకా చెప్పాడు.

ఇంతకాలం తర్వాత సరిహద్దుల్లో పాకిస్థాన్ సైన్యం చేసిన అకృత్యం చూసి ప్రణబ్ చలించిపోయాడు. పాక్ సైన్యానికి బుద్ధిచెప్పాలనుకున్నాడు. అప్పుడు ఆయనకు వివేకా, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు గుర్తొచ్చాయి. వెంటనే వివేకాకు ఫోన్ చేసాడు... విషయం చెప్పాడు. అవతల వివేకా... సార్, ఈ దేశ సేవలో పాలుపంచుకోవాలని నాకూ వుంది... కాని ఆరోగ్యం సరిగా లేదు.. మీకు నేను అన్ని విధాలా సాయపడతాను, ఇప్పుడే మా కమీషనర్‌కు ఫోన్‌చేసి చెబుతాను... మీకేం కావాలో అన్నీ వాళ్లు చూసుకుంటారు అని హామీ ఇచ్చాడు.

వివేకా ఫోన్ చేయడంతో కమీషనర్ ఆంజనేయులు, మాజీమేయర్ భానుశ్రీలు అప్పటికప్పుడు వందటన్నుల దోమలను పట్టి బస్తాలలో కుక్కి ఆర్మీట్రక్కుల్లోకి ఎక్కించారు. ఆ ట్రక్కుల్లో వాళ్లు, మాజీకార్పొరేటర్లు, కార్పొరేషన్ సిబ్బంది కూడా ఎక్కి జమ్మూ-కాశ్మీర్ సరిహద్దుల్లోకి వెళ్లారు. అక్కడ హెలికాప్టర్లలోకి ఆ బస్తాలను ఎక్కించి, బోర్డర్‌లో పాకిస్థాన్ సైన్యం మీద కుమ్మరించారు. అంతే ఆ క్షణం నుండి మొదలైంది పాకిస్థాన్ సైనికులకు నరకమంటే ఏమిటో... నెల్లూరు దోమల దెబ్బకు ఆ దేశ సైనికుల్లో సగం మంది వింతరోగాలు వచ్చి ఆసుపత్రులకు పోయారు. ఇంకొందరు ఉద్యోగాలు వదులుకుని ఇళ్లకుపోయారు. దీంతో పాకిస్థాన్‌వైపు సరిహద్దు అంతా సైనికులు లేక ఖాళీ అయ్యింది. భారత సైనికులు ఎంతో ప్రశాంతంగా సంక్రాంతి గాలిపటాలు ఎగరేసుకుంటూ, టీవీలో ఇండియా - ఇంగ్లాండ్ క్రికెట్‌మ్యాచ్‌లు చూస్తూ ఎంజాయ్ చేయసాగారు.

★★★★★

ప్రణబ్ అక్కడితో ఫ్లాష్‌బ్యాక్ ముగించి... అర్థమైంది కదా.. ఈ ఘనత ఎవరిదనేది అని అన్నాడు. అప్పుడు అందరూ ఈ దేశానికి మీ సేవలు అమోఘం, మీ నెల్లూరుదోమలు చేసిన సేవ అమూల్యమంటూ ఆంజనేయులు, భానుశ్రీ బృందాన్ని అభినందించారు.


# కోలాహలంగా జరిగిన ఏటిపండుగ



నిత్యం యాంత్రిక జీవన ప్రయాణంలో సతమతమైపోతున్న జనావళికి ఓ మంచి మజిలీ సంక్రాంతి. ఆ పండుగ వచ్చేదే పండుగనెలగా గణుతికెక్కిన ధనుర్మాసంలో. అయితే ఈ మాసం మొదలైన దగ్గర్నుంచి ఇళ్ళ ముంగిళ్ళలో రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దడంలో పోటీపడతారు వనితలు. వారు మహత్తరమైన ముగ్గుల మధ్యలో భక్తిభావం ఉట్టిపడేలా గౌరమ్మ రూపమైన గొబ్బెమ్మలను కూర్చోబెట్టి అలంకరించడం విశేషం. ఈ నెల రోజులు ఇళ్ళ ముంగిళ్ళలో ఆవిష్కృతమయ్యే గొబ్బెమ్మలను కనుమపండుగ అనంతరం ముక్కనుమరోజున పినాకిని నదిలో నిమజ్జనం చేయడం నెల్లూరీయులకు ఆనవాయితీ. అబ్బో, ఈ గొబ్బెమ్మల నిమజ్జనం(ఏటిపండుగ)రోజైన ఈనెల 16సాయంత్రం నెల్లూరు పెన్నాతీరం వివిధ వర్ణాలతో హోయలొలికింది. బంధువులు, స్నేహితులతో కలిసి తీరంవద్ద చేరిన మహిళా భక్తులు గొబ్బియలో, గొబ్బియలో అని పాడుతూ పళ్ళెంలో అలంకరించి తీసుకొచ్చిన గొబ్బెమ్మలను పెన్నానదిలో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. తదుపరి దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యాన తీరంలో నయనానందకరంగా కొలువైన దేవతా మూర్తులైన నర్రవాడ వెంగమాంబ, జొన్నవాడ కామాక్షితాయి, దర్గామిట్టలోని రాజరాజేశ్వరి, ఇరుకళల పరమేశ్వరి, మూలాపేట వేణుగోపాలుడు, మూలస్థానేశ్వరుడు, ధర్మరాజులస్వామి, ఇసుపూరు ముత్యాలమ్మ, స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి మాతలను దర్శించారు. వేడుకగా తరలివచ్చిన జనసందోహం కలిసిమెలసి అల్పాహారాలని ఆరగిస్తూ, ఆటలాడుకుంటూ ఆనందంగా సందడి చేశారు. ఈ సందట్లో చిన్నపిల్లలకు గాలిపటాలు పంపిణీచేయడంతో వారు సంతోషంగా ఉరకలు వేయడంతో ఆ ప్రదేశమంతా కోలాహలం నాట్యంచేసింది.

కార్యక్రమంలో నగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నేత ఆనం విజయకుమార్‌రెడ్డి, దేవాదాయశాఖ సహాయ కమీషనర్ సత్యారి యానాదిశెట్టి, జొన్నవాడ ఏసీ వేగూరు రవీంద్రరెడ్డి, రాజరాజేశ్వరి దేవాలయం ఏసీ వెండిదండి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

నూతన పెట్టుబడుల వైపు ఆలోచనలుంటాయి. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుంటాయి. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. స్వయంకృషితో అనుకున్నది సాధిస్తారు. మనస్సును కష్టపెట్టే చిన్నచిన్న సంఘటనల వల్ల టెన్షన్‌పడుతుంటారు. అధికారులకు స్థానచలనం బాధ్యతల మార్పుంటుంది. యజమానులకు వర్కర్లతో ఇబ్బందులుంటాయి. ఆరోగ్యం తృప్తికరంగా ఉంటుంది.


## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష 1, 2పాదాలు

వృత్తివ్యాపారాల పెరుగుదలకు చేబట్టిన ప్రయత్నాలు మంచి ఫలితాన్నిస్తాయి. సొంత నిర్ణయాలు, సొంత వ్యవహారాలు చేస్తే కలిసివస్తుంది. రావలసిన బాకీలు కొంత లభిస్తాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. ఉద్యోగుల విధి నిర్వహణ సుఖంగా సాగిపో తుంది. అధికారులకు పర్యాటనలు ఎక్కువగా ఉంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు ఆలస్యం కాగలవు.

## మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

సన్నిహితుల వల్ల సమస్యలు రావచ్చును. అనుకున్న పనులందు ఆటంకాలుండినా ధైర్యంగా ముందుకు సాగుతారు. మీ ఆరోగ్యం సరిగా ఉండదు. పిల్లల అనారోగ్య బాధలు బాధిస్తాయి. ప్రభుత్వ కార్యాలయాలలో అనుమతులకు ఆటంకాలురావడం, ప్రయాణాలు మానుకొనడం జరుగుతుంది. వాహనాలు నడిపేటప్పుడు యంత్రాలతో పనులందు జాగ్రత్త అవసరం.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆరోగ్యం ఇబ్బందిపెడుతుంది. జలుబు అలర్జీ కండర నరాల బాధలుండును. వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగుండి అభివృద్ధి ఉంటుంది. ఉద్యోగ వర్గాలకు అధికారుల నుండి వత్తిడి పెరుగుతుంది. మరియు పనిభారం ఎక్కువ. అనుకున్న పనులు సవ్యంగా ఆలస్యంగా జరుగుతాయి. స్థిరాస్తులపై ఆలోచనలు పెరిగి ప్రయత్నాలు చేస్తారు.


## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

సమావేశాలలో, కమిటీలలో మీ సలహా సూచనలు ఆమోదం పొందుతాయి. వృత్తిపరంగా తీరిక ఉండక పోయినా ఆదాయం బాగుంటుంది. వ్యాపార వర్గాలకు అవకాశాలు సన్నగిల్లుతాయి, ఆదాయం తగ్గుతుంది. అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. షేర్లు, క్రయ విక్రయాలలో లాభాలుంటాయి. ప్రభుత్వ కార్యాలయాలలో పనులు అనుకూలం కాగలవు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

పారిశ్రామికవర్గాలకు వ్యాపారవర్గాలకు మంచి ఆర్థికావకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. ప్రభుత్వ కార్యాలయంలో పనులు అనుకూలం కాగలవు. క్రొత్త కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు చేసుకొంటారు. కుటుంబ ఖర్చులు పెరిగినను ఆర్థిక ఇబ్బందులుండవు. పెట్టుబడి రంగాల నుండి ఆహ్వానాలు అవకాశాలు దొరుకుతాయి. స్థిరాస్తుల లావాదేవీలు చేపట్టగలరు.

## రాశి - మీ వాసి



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 18.01.2013 నుండి
తేది. 24.01.2013 వరకు.

ఈవారం మీనమేషవృషభమిథునరాశులలో చంద్రుడు. మేషంలో కేతువు. వృషభంలో గురువు. తులలో రాహు.శనులు.ధనుస్సులో శుక్రుడు. మకరంలో రవికుజబుధులు సంచరిస్తారు.


### పంచాంగము :

ముహూర్తములు లేవు.

### పుష్యమాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 18 | శుక్ర | సప్తమి | రా॥ గం.7.46ని॥ |
| తేది. 19 | శని | అష్టమి | రా॥ గం.8.49ని॥ |
| తేది. 20 | ఆది | నవమి | రా॥ గం.10.20ని॥ |
| తేది. 21 | సోమ | దశమి | రా॥ గం.12.10ని॥ |
| తేది. 22 | మంగళ | ఏకాదశి | రా॥ గం. 2.18ని॥ |
| తేది. 23 | బుధ | ద్వాదశి | రా॥ గం.4.30ని॥ |
| తేది. 24 | గురు | త్రయోదశి | పూర్తిగా |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కుటుంబసభ్యులతో బంధువర్గంతో విభేదాలను సర్దుబాటు చేసుకొంటారు. రాజకీయ వర్గాలకు, వృత్తి జీవనం కలవారికి ప్రజా సంబంధాలు బలపడతాయి. వృత్తి వ్యాపారరంగాలలో ఆర్థికావకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. విలువైన వస్తువులను, సౌకర్యాలను కొని సమకూర్చుకొంటారు. దూరప్రయాణాలు అనుకోకుండా జరుగుతాయి.


## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

సోదర, బంధువర్గం ద్వారా శుభవార్తలు వింటారు. అనుకున్న పనులు నెమ్మదిగా జరుగుతాయి. యజమానులకు వర్కర్లతో సమస్యలుండగలవు. ఉద్యోగప్రయత్నాలు సఫలం కావడానికి మరికొద్ది రోజులు పడతుంది. విద్యాప్రగతి బాగుంటుంది. ఉద్యోగులు వ్యాపారులు ప్రలోభాలకు లొంగకుండా జాగ్రత్తపడండి. అధికారులతో ఉద్యోగులకు సఖ్యత బాగుంటుంది.


## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థిక వ్యవహారాలు, స్థిరాస్తుల సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి. బిడ్డల విద్యా వివాహ విషయాలలో దృష్టిపెడతారు. పెట్టుబడులమీద, షేర్లమీద లాభాలుంటాయి. ఆత్మీయులను బంధువులను కలుసుకొని చర్చలు చేస్తారు. ఉద్యోగులకు అధికారవర్గంతో సఖ్యత, అదనపు పనిభారం ఉంటుంది. ఉద్యోగప్రయత్నాలలో చిన్న అవకాశాలు లభించగలవు.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలలో క్రమంగా ఆదాయం పెరుగుతుంది. ఆర్థికావకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ కార్యాలయాల నుండి అనుమతులు లభించగలవు. ఉద్యోగులకు మంచి సమర్థత పనిభారముండును. అధికారవర్గాలకు స్థానచలనము కలదు. గృహ,వస్తు,వాహనరిపేర్లుంటాయి. రావలసిన బాకీలపై హామీలు, కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం జరుగుతుంది.


## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థికపరంగా జాగ్రత్తలు తీసుకొనడం. వృత్తి వ్యాపారాలలో సామాన్య ఆదాయమేగాని మీశ్రమకు తగ్గ ప్రతిఫలముండదు. కోర్టు వ్యవహారాలు, ఋణాల విషయంలో రాజీకి అవకాశాలుండవచ్చును. అధికార వర్గాలకు స్థాన మార్పులు ప్రమోషన్లుండవచ్చును. స్థిరాస్తులపై రాబడి కొద్ది పెరుగుతుంది. ఆవేశాలు తగ్గించుకొని మాట్లాడటం చేయండి, లేకుండినచో తగాదాలు వచ్చే అవకాశం ఉన్నది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఇతరులకు ఏదో ఒక రూపంలో సహాయపడి అభినందింపబడతారు. డబ్బు, విలువైన వస్తువులు జాగ్రత్తగా కాపాడుకొనండి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. సమావేశాలలోను, ఇంటను మీ మాటకు విలువ ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. గృహమార్పులకు ప్రయత్నాలు జరుగుతాయి. విద్యాప్రగతి బాగుంటుంది.

# అంతర్‌రాష్ట్ర కేటుగాళ్ళు అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ బి.వి.రమణకుమార్

పలు దారిదోపిడీలు, మోటార్‌బైక్‌లు, సైకిళ్ళు దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకుని తిరుగుతున్న అంతరాష్ట్ర కేటుగాళ్ళను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ బి.వి.రమణ కుమార్ తెలిపారు.

ఒంగోలు పట్టణంలోని రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన బొల్లి గురవయ్య, తుమ్మల శ్రీనివాస్ అలియాస్ ఆంధ్రా శ్రీను, నెల్లూరుజిల్లా కోడూరుపాడు గ్రామానికి చెందిన మల్లిఖార్జునలు కలసి మోటార్‌సైకిళ్ళపై తిరుగుతూ ఒంటరిగా వెళుతున్న మహిళల మెడల్లోని బంగారు నగలను లాక్కెళ్ళేవారని, మోటార్‌బైక్‌లను కూడా అపహరిస్తూ సొమ్ము చేసుకుని జల్సా చేసుకొనేవారని తెలిపారు. వీరందరిని 12వతేదీ మినీబైపాస్ రోడ్డు అన్నమయ్య విగ్రహం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించి వీరి వద్ద నుంచి 20సవర్ల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. 28సైకిళ్ళను, మోటారుసైకిళ్ళను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ సుమారు 9.50లక్షలు ఉంటుందన్నారు. నిందితులను అరెస్ట్‌చేసి సొత్తును రాబట్టిన సిసిఎస్ సిఐలు వీరాంజనేయరెడ్డి, ఖాసింపీర, 5వనగర సిఐ ఎస్.వి.రాజశేఖరరెడ్డి, సిసియస్ హెడ్‌కానిస్టేబుళ్ళు ఎస్.వెంకటేశ్వర్లు, వై.సుధాకర్, రమేష్, డి.సుధాకర్, కానిస్టేబుళ్ళు, ఎ.శిఖామణి, వెంకటేశ్వర్లు, గిరిధర్, పోలయ్య, ఇతియాజ్, మాల్యాద్రి, జగదీష్, చక్రవర్తిలను ఎస్పీ అభినందించి రివార్డులను ప్రకటించారు.

# యూఆర్ అటెన్షన్...ప్లీజ్..

## జనవరి 21 నుంచి రైలు ఛార్జీలు పెరుగుతాయ్...

నిత్యావసర ధరలతో బాటు, వంటగ్యాస్ ఇంధన ధరలు పెరిగి సామాన్య మానవుడు సతమతమవుతుంటే, మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు రైలు ఛార్జీలను పెంచడం పేద మధ్యతరగతి ప్రజలను మరింత కుంగదీస్తోంది. సామాన్య ప్రజలకు అందుబాటులో వుండే రైలు ప్రయాణం ఇక మీదట పెనుభారంకానుంది. కొత్త ధరలు జనవరి 21 నుంచి అమలులోకి రానున్నాయి. కిలోమీటర్‌కు 6పైసల నుంచి 10పైసలు వరకు పెంచుతూ రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు ప్రతి టిక్కెట్టు మీద 5రూపాయలు అదనపు వస్సూవేసింది. నెల్లూరు రైల్వేస్టేషన్లో ప్రతి రోజూ 54 రైళ్ళు రాకపోకలు సాగిస్తుంటాయి. దాదాపు 13వేలకు పైగా ప్రయాణీకులు రైళ్లపై ఆధారపడి రాకపోకలు సాగిస్తున్నారు. బస్సు ఛార్జీలకంటే రైలు ఛార్జీలు చాలా తక్కువగా ఉండటంతో ఎక్కువమంది ప్రయాణీకులు రైలుపై ఆధారపడుతున్నారు. వీరిలో పేద మధ్య తరగతి ప్రజలే ఎక్కువ.

ప్రస్తుతం నెల్లూరు నుండి హైదరాబాదుకు జనరల్ టిక్కెట్టు 123 రూపాయలు ఉండగా 145రూపాయలకు పెరిగింది. ఎక్స్‌ప్రెస్‌లో 135 రూపాయల నుండి 180 రూపాయలు చెల్లించాల్సి వుంటుంది. స్లీపర్‌క్లాసులో ప్రస్తుతం 252రూపాయలు ఉండగా 321రూపాయలకు చేరింది. ఏసి త్రీటైర్‌లో ప్రస్తుతం 677రూపాయలు నుండి 722రూపాయలకు ఏసీ టూటైర్‌లో ప్రస్తుతం 1000రూపాయల నుండి 1068రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. వీరంతా అదనపు భారానికి సిద్ధపడాల్సిందే. ప్రస్తుతం నెల్లూరు రైల్వేస్టేషన్లో ప్రతిరోజూ రిజర్వేషన్ కౌంటర్ ద్వారా 4లక్షలు జనరల్ కౌంటర్ ద్వారా 4.5లక్షల రూపాయలు వసూలవుతోంది. ఛార్జీలు పెరిగిన తర్వాత ఈ మొత్తం పెరిగే అవకాశముంది.

# పెళ్లి సంబంధాలు





## వధువు కావలెను

1. 1982 జనవరి 5 జననం. ఎత్తు 5'9". చదువు బి.టెక్. వృత్తి వ్యాపారం. ఉన్నతమైన రెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివాటా 10కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా.
2. 1979 ఏప్రిల్ 20 జననం. ఎత్తు 6". చదువు బి.టెక్. వృత్తి వ్యాపారం. ఆస్తివిలువ 5కోట్లు. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
3. 1988 జూలై 9 జననం. ఎత్తు 5'10". చదువు బి.టెక్, యం.బి.ఏ. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివిలువ 7కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా.
4. 1984 డిసెంబరు 23 జననం. ఎత్తు 5'9". చదువు బి.టెక్(కంప్యూటర్స్). ఉద్యోగం కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ చెన్నై. జీతం నెలకు 70.000/-. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్తివిలువ 3కోట్లు స్వస్థలం నెల్లూరుజిల్లా.
5. 1985 జూలై 24 జననం. ఎత్తు 5'7". చదువు బి.టెక్(కంప్యూటర్స్), యం.బి.ఏ(హెచ్ఆర్). ఉద్యోగం సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆక్సెంచర్, హైదరాబాద్. జీతం నెలకు 60,000/-. ఉన్నతమైనరెడ్డి వ్యవసాయకుటుంబం. ఆస్తివిలువ 2కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా.

## వరుడు కావలెను

6. 1988 జనవరి 9 జననం. ఎత్తు 5'21/2". చదువు బి.టెక్(ఐటి), యం.టెక్. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివిలువ 3కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుతనివాసం హైదరాబాద్.
7. 1985 జనవరి 4 జననం. ఎత్తు 5'3". చదువు యం.సి.ఏ(తెనాలి). ఉన్నతమైనరెడ్డి వ్యవసాయ మధ్య తరగతి కుటుంబం. స్వస్థలం ప్రకాశంజిల్లా. ఆస్థివాటా 20లక్షలు.
8. 1991 మే 20 జననం. ఎత్తు 5'7". చదువు బి.టెక్(ఇఇఇ) చెన్నై. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్థివాటా 5కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుతనివాసం మద్రాసు.
9. 1992 జనవరి 17 జననం. ఎత్తు 5'31/2". చదువు బి.యస్.సి(బెంగుళూరు), యం.యస్(హ్యూమన్ రిసోర్సెస్) బెంగుళూరు. స్వస్థలం మద్రాసు ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్థివాటా 3కోట్లు.
10. 1981 ఆగష్టు 7 జననం. ఎత్తు 5'4". చదువు బి.యస్.సి(కంప్యూటర్స్). యం.బి.ఏ(హెచ్.ఆర్). ఉన్నతమైనరెడ్డి ఉద్యోగ కుటుంబం. ఆస్థివాటా 11/2కోటి. స్వస్థలం నెల్లూరుజిల్లా.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413, పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.
98480 34522
94406 39460.
పోస్టుబాక్స్ నెం.4, C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ప్లాట్ నెం. 1 & 2. మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

PDF Compressor Free Version



## మూ'వీ'క్షణం





## నొచ్చుకున్న నమ్రత

తాను బాలీవుడ్‌కు పోయేది లేదని ఈమధ్య మహేష్‌బాబు తెగేసి చెప్పాడు. అయితే ఈ మాట ఆయన భార్య నమ్రతకు ఏ మాత్రం నచ్చడం లేదట! మహేష్ బాబును బాలీవుడ్‌లో టాప్‌రేంజ్‌లో చూసి తన మాతృ పరిశ్రమలో ఆయన వెలిగిపోతుంటే మురిసిపోవాలనేది ఈమె కోరిక.

## ఎన్టీఆర్ కొత్త గెటప్



సినిమాకు ఓ గెటప్‌లో కనిపించే యంగ్‌టైగర్ ఎన్టీఆర్ 'బాద్‌షా'లో కొత్త గెటప్‌తో కనిపించ నున్నాడు. తాజాగా విడుదల చేసిన 'బాద్‌షా' ఫస్ట్‌లుక్ స్టిల్స్‌లో ఆయన హెయిర్‌స్టైల్, డ్రెస్‌కోడ్ చాలా స్టైలిష్‌గా వున్నాయి. ఆయన గెటప్ చూస్తుంటేనే ఈ సినిమాలో ఆయనది మాస్ పాత్ర అని అర్ధమవుతుంది.

## రుద్రమదేవిగా జేజమ్మ



'అరుంధతి'తో తానేంటో నిరూపించుకున్న అనుష్క త్వరలో 'రాణీ రుద్రమదేవి' పాత్రలో కనిపించేందుకు సిద్ధమైంది. గుణశేఖర్ దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుంది. ఈ చిత్రాన్ని 3డిలో చిత్రీకరిస్తుండడంతో యూరోపియన్ సాంకేతిక నిపుణుల సహకారాన్ని తీసుకో నున్నారు. ఇళయరాజ సంగీతం అందించే అవకాశా లున్నాయి.

## గూడూరు డివిజన్ వార్తలు

### సంప్రదాయాలకు ప్రతీకలు మన పండుగలు




సమావేశంలో ప్రసంగిస్తున్న బిజెపి అగ్రనేత వెంకయ్యనాయుడు

భారతీయ సంస్కృతీసంప్రదాయాలకు మన పండుగలు ప్రతీకలని బిజెపి జాతీయ నాయకులు ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. 13వ తేదీ గూడూరు వెటరన్‌క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా గూడూరు అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ గూడూరులోని వెటరన్ క్రికెట్ పోటీలను పండుగరోజు నిర్వహించడంవలన ఈ ప్రాంతంలో ఉన్న పాత క్రీడాకారులు అందరూ ఒకచోట చేరి, వారి జ్ఞాపకాలను తెలియపర్చుకొనే అవకాశం ఉంటుందన్నారు. మన దేశంలో క్రీడలకు తగినంత ప్రోత్సాహం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు 2శాతం నిధులను కేటాయించి గ్రామీణ క్రీడలతో పాటు క్రీడల్లో ప్రతిభ కనపరిచిన వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంపట్ల గౌరవం, మనభాష అయిన తెలుగు పట్ల అభిలాష ఉండాలని అన్నారు. మనం భారతీయులం అనే విధంగా ప్రతిపౌరుడు ఉండాలని అన్నారు. ఇటీవల కాలంలో మహిళల పట్ల జరుగుతున్న దారుణాల పట్ల ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

సభకు అధ్యక్షత వహించిన వెటరన్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కనుమూరు హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ పండుగ వాతావరణంలో ఈ పోటీలను మూడురోజుల పాటు నిర్వహిస్తున్నారని, దాదాపు ఇందులో పాల్గొనే క్రీడాకారులు కేవలం క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మెన్ పాశం సునీల్‌కుమార్, కోట మాజీ ఎంపిపి మానికల పవన్‌కుమార్, కార్యదర్శి కె.మునిగిరిష్, నాగేశ్వరరావు, కరీముల్లా, సుబ్రహ్మణ్యం జానకిరామిరెడ్డి ప్రసంగించారు.

గూడూరు తూర్పువీధిలోని బ్రాహ్మణవీధిలో
ఇల్లు అమ్మబడును
గూడూరులోని తూర్పువీధి ప్రాంతంలోగల బ్రాహ్మణవీధిలో వున్న సుమారు 30 అంకణముల స్థలంలో నిర్మించబడివున్న 10 1/2 అంకణముల కట్టుబడి కలిగిన మిద్దె ఇల్లు అమ్మబడును.
కొత్త కట్టుబడితో వెంటనే నివాసముండడానికి అనువైన ఇల్లు.
ఆసక్తిగలవారు ఎ.శివకుమార్, 94404 50452 నెంబరు నందు సంప్రదించవలెను.

### ఎఆర్‌డి సంస్థ కృషి అభినందనీయం



గిరిజన కుటుంబాలకు పనిముట్లను అందజేస్తున్న డిఎస్‌పి సురేష్‌కుమార్

గిరిజనుల జీవనోపాధికి గూడూరులోని ఎఆర్‌డి సంస్థ కృషి అభినందనీయమని గూడూరు సబ్‌డివిజనల్ పోలీసు అధికారి కె.సురేష్‌కుమార్ అన్నారు.

13వ తేదీ ఆయన కార్యాలయంలో చిల్లకూరు మిక్స్‌డ్ కాలనీలో ఇటీవలే వెట్టి నుండి విముక్తి పొందిన ఎనిమిదిమంది కుటుంబాలకు ఎఆర్‌డి సంస్థ సహకారంతో 25వేల రూపాయల విలువచేసే సైకిళ్లు, టకారాలు, పారలు, గడ్డపారలు, కత్తులను డిఎస్పీ గిరిజనులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో చిల్లకూరులోని ఓ దాబాలో వెట్టిచాకిరీ చేయించుకుంటూ ఓ బాలుడు హత్యకు గురికాగా మరికొంతమంది వెట్టి చాకిరీ చేస్తున్న విషయాన్ని తెలుసుకొని ఎఆర్‌డి సంస్థ స్థానిక అధికారుల చొరవతో వారికి వెట్టి నుండి విముక్తి కల్పించారు. వారికి ప్రభుత్వపరంగా అందాల్సిన సాయాన్ని గూడూరు సబ్‌కలెక్టర్ జె.నివాస్ అందజేయగా, వెట్టి నుండి విముక్తి పొందినవారికి జీవనోపాధి కల్పన కోసం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేసేందుకు వారికి అవసరమైన పనిముట్లను ఎఆర్‌డి సంస్థ సమకూర్చడం ఎంతైనా అభినందించతగ్గ విషయమన్నారు. చిన్నపిల్లలను పనిలో పెట్టుకొంటే నేరమని, ప్రతిఒక్కరూ ఈ విషయాన్ని తెలుసుకొని వెట్టిచాకిరీ వారి చేత చేయించకుండా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎఆర్‌డి సంస్థ కార్యదర్శి బషీర్ తదితరులు పాల్గొన్నారు.

### పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ



పేదవిద్యార్థులకు విద్యాసామాగ్రీ, సమదుస్తులు అందజేస్తున్న భూదేవమ్మ

కన్నతల్లిలాంటి సొంతూరిని మరవవద్దని, శిరసనంబేడు భూదేవమ్మ తన గ్రామానికి చేస్తున్న సేవలు అభినందనీయమని వైకాపా జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నేదురుమల్లి పద్మనాభరెడ్డి అన్నారు. ఇటీవల వాకాడు మండలం అందలమాలలో ప్రాథమిక పాఠశాలలోని 30 మంది పేద విద్యార్థులకు శిరసనంబేడు సిద్ధారెడ్డి, భూదేవమ్మల దాతృత్వంతో సమదుస్తులు, రెండు జతలు బూట్లు, టైలు, బెల్టులు, ఇతర విద్యాసామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా శిరసనంబేడు భూదేవమ్మ "లాయర్"తో మాట్లాడుతూ మంచినీటి వసతి, కల్యాణమండపం పాఠశాలకు సరస్వతి విగ్రహాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకాడు మండల తహశీల్దార్ సునీల్, ఎంఇఓ బాబు, హెచ్‌ఎం రాధాకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### టీసీ గోవిందయ్య నిజాయితీ

చెన్నై నుంచి గూడూరు వెళ్లే నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలుకు టీసీ గోవిందయ్య, ఒక ప్రయాణికురాలు మర్చిపోయిన నగదుపర్సును తిరిగి ఆమెకు చేరవేసి నిజాయితీ చాటుకున్నారు. ఇటీవల గూడూరులో ఈ సంఘటన జరిగింది. ప్రయాణికురాలు వాకాడు మండలం అందలమాల గ్రామానికి చెందిన శిరసనంబేటి భూదేవమ్మ చెన్నై నుంచి గూడూరుకు చేరుకుంది. రైలులో తన పర్సు మర్చిపోయింది. టీసీ గోవిందయ్య కొద్దిసేపటి తర్వాత ఆమెకు ఫోన్‌చేసి, పర్సును గూడూరు స్టేషన్‌లో అందజేశాం తీసుకోమని చెప్పారు. పర్సులో 20,500రూపాయల నగదు ఉన్నట్లు భూదేవమ్మ తెలిపింది.

### వైభవంగా సంక్రాంతి

గూడూరులో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వివిధ రకాల సామాగ్రిని కొనుగోలు చేసేందుకు స్థానికులే కాకుండా గ్రామీణ ప్రాంత ప్రజలు రావడంతో గూడూరు పట్టణం కిటకిటలాడింది. బట్టల దుకాణాలు, పిండి మిల్లులు, చికెన్‌స్టాల్స్ వద్ద రద్దీ ఏర్పడింది. ముగ్గులు వేసేందుకు అవసరమైన రంగులను కొనుగోలు చేసేందుకు మహిళలు దుకాణాల వద్ద బారులు తీరారు. పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో కోడి పందెలు యథేచ్ఛగా నిర్వహించారు.

### పందెంకోళ్లపై పోలీస్ పంజా

వెంకటగిరి పోలీసులు సంక్రాంతి కోడి పందేలపై ఉక్కుపాదం మోపారు. వెంకటగిరి సర్కిల్‌లోని వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, రాపూరు పోలీసు స్టేషన్‌ల పరిధిలో కోడిపందేలు ఆడుతున్న 90మందిని అదుపులోకి తీసుకుని 70 పందెంకోళ్లను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా వివిధ ప్రాంతాలలో 50 మంది పేకాటరాయుళ్లను కూడా అరెస్ట్ చేశారు. వెంకటగిరి సి.ఐ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో ఎస్.ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# హైదరాబాద్‌లో టాక్ ఆఫ్ ది సిటి





## అనిల్ - పార్వతిల కొత్తిల్లు వేడుకలు..!

ఇప్పుడు హైదరాబాద్‌లో ఎక్కడ చూసినా వినపడుతున్న మాట నెల్లూరుజిల్లా అల్లూరుకు చెందిన నూకలపాటి అనిల్ - పార్వతిల కొత్తిల్లు. జూబ్లిహిల్స్‌లో వీరు నిర్మించిన అత్యాధునిక సుందరబృందావనంలో జనవరి రెండవ వారంలో నగరంలోని ప్రముఖులందరినీ పిలిచి గృహప్రవేశ పార్టీ ఇచ్చారు ఈ దంపతులు. హైదరాబాదులోని వివిధ రంగాల ప్రముఖులను, కుటుంబంలోని పెద్దలని పిల్లలని, నెల్లూరీయులని గ్రూపులుగా విభజించి 4రోజుల పాటు గృహప్రవేశ పార్టీని ఏర్పాటు చేశారు.

ఈ వేడుకలలో జి.వి.కె.రెడ్డి, తిక్కవరపు సుబ్బరామిరెడ్డి, వేణుంబాక విజయసాయిరెడ్డి, ఈనాడు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్, సి.యం.రమేష్, కేంద్రమంత్రి పల్లంరాజు, సినీనటుడు వెంకటేష్, పింకీరెడ్డి, జూనియర్ యన్.టి.ఆర్, శ్రీమతి ప్రణీత, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, ఎబిడియంకె రాజ్యసభ యం.పి. రవి, రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మండవ వెంకటేశ్వరరావు, వేమూరి రాధాకృష్ణ, ఆదాల రాఘవరెడ్డి, "జె.పి.మోర్గాన్" ప్రపంచ హెడ్ దీపక్ మంగ్ల, కుందు కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ బాలరాజ్‌కుందు, తిక్కవరపు సందీప్, సరితారెడ్డిలు, శాంత బయోటెక్స్ వరప్రసాద్‌రెడ్డి, ఇన్‌ఫోసిస్ మోహన్‌రెడ్డి, బొల్లినేని శీనయ్య, డి.వి. నాయుడుతో పాటు ఇంకా అనేక రంగాలకు చెందిన ప్రముఖులు తమ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

ప్రస్తుతం హైదరాబాద్ సెలబ్రిటీ సర్కిల్‌లో ఎక్కడ చూసినా అనిల్-పార్వతిల కొత్తిల్లే టాక్ ఆఫ్ ది సిటి. ఈ ఇల్లు గురించి, ఇంటి విశేషాల గురించి మరోసారి ముచ్చటించుకుందాం.




మాగుంట లే అవుట్ నివాసితులకు

# నూతన కమిటి ఆహ్వానము

"మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్"
కొత్త కమిటి తమ బాధ్యతలు స్వీకరిస్తున్న శుభసందర్భాన్ని పురస్కరించుకుని
'లోకకళ్యాణార్థం' ధర్మప్రచార పరిషత్, తిరుమల తిరుపతి దేవస్థానముల
ఆధ్వర్యంలో జనవరి 26వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుండి
స్వామి వారి అభిషేక మహోత్సవము మరియు 10 గంటల నుండి

# శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కళ్యాణం

మాగుంట లే అవుట్‌లోని సి.పి.ఆర్. కళ్యాణ మండపము నందు జరుగును. ఈ మహోత్సవంలో మాగుంట లే అవుట్ నివాసితులందరూ పాల్గొని తీర్థప్రసాదములు, పసుపుకుంకుమలు స్వీకరించి స్వామివారి కృపాకటాక్షములను పొందవలసిందిగా మనవి.

ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారందరూ దిగువ నంబర్ల నందు జనవరి 20వ తారీఖు ఆదివారంలోగా తమ పేర్లను నమోదు చేసుకుని ఉచిత ప్రవేశపాసులను పొందవలసినదిగా విజ్ఞప్తి. పాసులున్నవారికి మాత్రమే ప్రవేశము.

| కనుమూరు శ్రీనివాసులురెడ్డి | ముడి శోభన్‌కుమార్‌రెడ్డి | దండమూడి హేమంత్‌కుమార్ | గొళ్ళమూడి శ్రీధర్‌రెడ్డి |
|---|---|---|---|
| 98493 76509 | 94906 88008 | 94402 76268 | 98492 64028 |

ఈ మహోత్సవంలో...
శ్రీ ఆనం రామనారాయణరెడ్డి
రాష్ట్ర ఆర్థికశాఖామాత్యులు
శ్రీ ఆనం వివేకానందరెడ్డి
శాసనసభ్యులు, నెల్లూరు గ్రామీణం
శ్రీ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి
శాసనసభ్యులు, నెల్లూరు నగరం
శ్రీమతి మాగుంట పార్వతమ్మ
మాజీ శాసనసభ్యురాలు
శ్రీ బి.శ్రీధర్
కలెక్టర్, నెల్లూరుజిల్లా
శ్రీ బి.వి.రమణకుమార్
యస్.పి., నెల్లూరుజిల్లా
శ్రీ టి.యస్.ఆర్. ఆంజనేయులు
కమీషనర్, నెల్లూరు నగర మున్సిపల్ కార్పొరేషన్
శ్రీ ఆనం విజయకుమార్‌రెడ్డి
కాంగ్రెస్ నాయకులు
శ్రీమతి నందిమండలం భానుశ్రీ
మాజీమేయర్



అతిథులుగా పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో మాగుంట లే అవుట్ నివాసితులందరూ పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందవలసిందిగా విజ్ఞప్తి.

ఈ అవకాశం
మాగుంట లే అవుట్ పరిధిలోని
యం.యస్.ఆర్.నగర్ మరియు
కింగ్స్‌కోర్టు అవెన్యూ
నివాసితులకు మాత్రమే.



గౌరవాధ్యక్షులు
గౌరవసలహాదారు

జనవరి 20వ తారీఖు
ఆదివారంలోగా
తమ పేర్లను నమోదు చేసుకుని
ఉచిత ప్రవేశపాసులను
పొందవలెను.



అధ్యక్షులు | ఉపాధ్యక్షులు | ప్రధానకార్యదర్శి | కోశాధికారి | సహాకార్యదర్శి | సహాకార్యదర్శి

# మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్

PDF Compressor Free Version






దాదాపు మూడు నెలలుగా అనారోగ్యంతో నెల్లూరు ప్రజలకు దూరమై హైదరాబాద్‌లో వుంటున్న నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి నెల్లూరు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పూర్తి ఆరోగ్యంతో త్వరలోనే నెల్లూరుకు వస్తానని ఆయన సమాచారమిచ్చారు. ఈ సందర్భంగా తన కుటుంబసభ్యులతో కలిసి దిగిన ఫోటోతో శుభాకాంక్షల సందేశం పంపారు.

## ఇస్కాన్ సారధ్యంలో.. వేమిరెడ్డి దాతృత్వంతో...

### వస్తున్నాయ్.. వస్తున్నాయ్...

# జగన్నాథ రథచక్రాలు..!



అంతర్జాతీయ కృష్ణ సంఘం(ఇస్కాన్) సారధ్యంలో గతయేడాది నిర్వహించిన "జగన్నాథయాత్ర" తీపిగురుతులు నెల్లూరీయుల మదిలో వుండగానే, అప్పుడే యేదాది గడచిపోయి రెండవ యాత్రకు ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 19వతేదీ ఏ.సిబొమ్మ సెంటర్ నుండి ప్రారంభంకానున్న ఈ యాత్రను ప్రముఖ సంఘసేవకులు, పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ప్రారంభించనున్నారు. అక్కడ నుండి మొదలై ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ, వి.ఆర్.సిసెంటర్, మద్రాసుబస్టాండు, ఆర్.టి.సి, మాగుంట విగ్రహం మీదుగా టి.టి.డి కళ్యాణమండపం వద్ద ఈ యాత్ర ముగుస్తుంది. దాదాపు 40వేల మంది భక్తులు ఈ యాత్రలో పాల్గొంటారని అంచనా.

ఈ సందర్భంగా పలువురు దాతలు ఇస్కాన్‌కి తమ సహాయ సహకారాలు అందిస్తుండగా భక్తులకోసం అవసరమయ్యే భోజన ప్రసాదాలను వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సమకూరుస్తున్నారు. భక్తులందరూ క్రమశిక్షణతో ఈ కార్యక్రమంలో పాల్గొని దిగ్విజయం చేయాలని ఇస్కాన్ మందిర నెల్లూరు సారధి సుఖదేవస్వామి కోరారు. గతేడాదికంటే మించి ఈ సంవత్సరం వేలాది భక్తులు పాల్గొంటారని, స్వామిని తలచుకుంటూ భజనలు చేస్తూ, కోలాటాలు ఆడుతూ భక్తి తన్మయత్వంతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా రథాన్ని లాగుచూ సాగే జగన్నాథుని రథయాత్రకు ఎక్కడికక్కడ మహిళా భక్తులు రహదారులపై రంగవల్లులు తీర్చిదిద్ది స్వాగతం పలకడం శోభను చేకూరుస్తుందని ఆయన తెలిపారు.

# టాన్‌టెక్స్ 27వ అధ్యక్షుడిగా సురేష్



అమెరికాలోని తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ 27వ అధ్యక్షుడిగా మండువ సురేష్ జనవరి 6వతేదీన ప్రమాణస్వీకారం చేశాడు. వృత్తిరీత్యా తెలుగుగంగ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేస్తూ పదవీవిరమణ అనంతరం నెల్లూరులో స్థిరపడిన మండువ శ్రీనివాసరావు కుమారుడే సురేష్.

18సంవత్సరాలుగా అమెరికాలో స్థిరపడిన సురేష్ టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్ నగరంలో వుంటున్నారు. తెలుగు వారితో పాటు అక్కడ స్థానిక భారతీయులు నిర్వహించే అన్ని కార్యక్రమాలలోనూ సురేష్ చురుగ్గా పాల్గొనేవాడు.

చిన్నతనంలో టెక్సాస్ అధ్యక్ష పదవిని చేపట్టిన సురేష్ తన ప్రమాణస్వీకార సందర్భంగా మాట్లాడుతూ మే,జూలై మాసాలలో జరుగనున్న తానా, నాట్స్ సభలకు హాజరుకానున్న తెలుగువారందరికీ "టాన్‌టెక్స్" సముచిత గౌరవాన్ని అందిస్తుందని ప్రకటించారు. యేడాది కాలం పాటు కొనసాగే తన పదవీకాలంలో సంస్థ అధ్యక్షుడిగా తెలుగువారి అవసరాలను తీర్చడానికి తాను ఎల్లవేళలా అందుబాటులో వుంటానని ప్రకటించాడు. సురేష్‌కి "లాయర్" అభినందనలు.

# డా॥జగదీష్‌కు అంతర్జాతీయ గుర్తింపు



స్థానిక నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ డైరెక్టర్, కవరైపేటలోని ఆర్.యం.కె ఇంజనీరింగ్ కాలేజ్ ప్రొఫెసర్, డా॥జగదీష్ 'ఆస్ట్రేలియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హై ఎనర్జిటిక్ మెటీరియల్స్' ప్రచురించే 'రీసెర్చ్ బులెటిన్'కు డిప్యూటీ ఎడిటర్-ఇన్-చీఫ్‌గా నియమితులయ్యారు. ఇప్పటికే డా॥ జగదీష్ ఈ ఇన్స్టిట్యూట్ వైస్ ఛాన్సలర్ (సైంటిఫిక్ కమ్యూనికేషన్స్)గా ఉన్నారు.

డాక్టర్ జగదీష్ ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, అప్రాప్రియేట్ టెక్నాలజీలలో విశేషకృషిచేశారు. ఆయన అంతర్జాతీయ, జాతీయ వైజ్ఞానిక పత్రికలలో, సదస్సులలో 130కి పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించారు. ప్రతిష్టాత్మక మార్గరేట్ నోబుల్ ఫౌండేషన్, సీటెల్, అమెరికా అవార్డు, మరో 15 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు. ప్రతిభలో ప్రకాశిస్తున్న డాక్టర్ జగదీష్‌కు 'లాయర్' అభినందనలు.

# 18వ వర్ధంతి



జననం: 08-11-1930 మరణం: 18-01-1995

## స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి

వ్యవస్థాపకులు

**లాయర్**

జాతీయ తెలుగు వారపత్రిక



మహనీయుని మహాత్మకు మా నివాళి

'లాయర్' సిబ్బంది కుటుంబసభ్యులు

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY.**